
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

3

శుక్రవారం 7 నవంబరు 2025

నేటి నుంచి బాలల పండుగ
- వీవీఐటీయూ బాలోత్సవ్‌కు సర్వం సిద్ధం
- వేడుకలకు వర్సిటీ ప్రాంగణంలో 32 వేదికలు


ఆప్కో వస్త్ర నిల్వలతో నూతన డిజైన్లు
మంగళగిరిలో ఆప్కో గోదాం తనిఖీ చేసిన మంత్రి సవిత

6

పసుపు ధరలు పైపైకి...
నాలుగు నెలల్లో క్వింటాల్‌కు రూ.4 వేలు పెరుగుదల

అమరావతి ఓఆర్ఆర్‌కు తొలిఅడుగు

భూసేకరణకు ఎన్‌హెచ్‌ఏఐ శ్రీకారం



- పల్నాడు జిల్లాలో రెండు మండలాలకు గెజిట్
- తుది దశలో మిగిలిన 3 జిల్లాల గెజిట్ రూపకల్పన
- మొత్తం 23 మండలాలు.. 97 గ్రామాల్లో భూసేకరణ

అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నిర్మాణానికి సంబంధించి తొలిఅడుగు పడింది. ఓఆర్ఆర్ నిర్మాణంలో అత్యంత కీలకమైన భూసేకరణ ప్రక్రియకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో భూసేకరణను పల్నాడు జిల్లా నుంచి మొదలుపెట్టింది. ఓఆర్ఆర్ గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణ, ఏలూరు జిల్లాల్లో 23 మండలాలు, 97 గ్రామాల గుండా వెళ్తుండగా తొలుత పల్నాడు జిల్లాలో భూసేకరణ ప్రక్రియను ప్రారంభించేందుకు వీలుగా గెజిట్ నోటిఫికేషన్(3ఏ) జారీ చేసింది. అమరావతి, పెదకూరపాడు మండలాల్లోని 9 గ్రామాల మీదగా నిర్మాణం జరిగే ఓఆర్ఆర్ కోసం భూముల వివరాలను సేకరించారు. ఓఆర్ఆర్ పరిధిలోకి వచ్చే భూముల సర్వేనెంబర్లు, భూయజమానుల వివరాలను తెలుపుతూ నోటిఫికేషన్ జారీ చేశారు. అమరావతి ఓఆర్ఆర్ 6 వరుసలతో 190 కి.మీ. నిర్మించనున్నారు.

ఈస్ట్‌కు బదులు లింకురోడ్డు

ఓఆర్ఆర్‌కు అంగీకరించిన కేంద్ర ప్రభుత్వం విజయవాడ ఈస్ట్ బైపాస్‌కు నో చెప్పింది. రాజధాని అమరావతి, గుంటూరు, విజయవాడ మధ్య రాకపోకలకు అత్యంత కీలకమైన ఈ బైపాస్‌కు ప్రత్యామ్నాయంగా ఓఆర్ఆర్, ఎన్‌హెచ్-16ను అనుసంధానం చేస్తూ రెండు లింకు రోడ్లకు ఆమోదం తెలిపింది. తెనాలి సమీపంలోని నందివెలుగు వద్ద ఓఆర్ఆర్ నుంచి చెన్నై- కోల్‌కతా హైవేలోని వెస్ట్ బైపాస్ విలీన ప్రాంతం కాజ వరకూ 17.5 కి.మీ మేర లింకు రోడ్డును నిర్మించనున్నారు. నారాకోడూరు నుంచి బుడంపాడు వద్ద ఎన్‌హెచ్-16ను అనుసంధానిస్తూ 5.200కి.మీ. మేర మరో లింక్‌రోడ్డు నిర్మించనున్నారు.

రెవెన్యూ గ్రామం	సేకరించే భూమి ఎకరాల్లో
లింగాపురం	97.68
ధరణికోట	468.19
మూసాపురం	26.18
పాటిబండ్ల	185.806
జలాల్‌పురం	132.489
కంభంపాడు	41.48
తాళ్లూరు	69.92
లింగంగుంట్ల	1.3
బలుసుపాడు	150.31

నరసరావుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి సంబంధించి ఓఆర్ఆర్ నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. జిల్లాలవారీగా భూసేకరణకు ఎన్‌హెచ్‌ఏఐ గెజిట్లు ప్రచురిస్తోంది. తొలుత పల్నాడు జిల్లాలోని రెండు మండలాల పరిధిలోని గ్రామాలకు సంబంధించి గెజిట్ ప్రచురించింది. ఓఆర్ఆర్ ప్రాజెక్టు భూసేకరణ చేయనున్నామని, ఆయా సర్వే (మిగతా 4వ పేజీలో)

దాహార్తి.. దరిచేరకుండా

తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం

- పథకాల విస్తరణకు రూ.501.07 కోట్లు టెండర్ పిలిచిన పబ్లిక్ హెల్త్ శాఖ
- జీఎంసీ 10 విలీన గ్రామాలకూ విస్తరణ
- పిడుగురాళ్ల, మాచర్లకు బుగ్గవాగు నుంచి తాగునీరు



మాచర్ల వ్యూ

పట్టణాలకు మహర్దశ పట్టనుంది. గుంటూరు కార్పొరేషన్, పిడుగురాళ్ల, మాచర్ల మునిసిపాల్టీల్లో తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. పుష్కలంగా తాగు నీటిని అందించేందుకు ఉన్న పథకాలను విస్తరించనున్నారు. ఇందుకు అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ నిధి (యూఐడీఎఫ్) నుంచి రూ.501.07 కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఈ పనులు చేపట్టేందుకు పబ్లిక్ హెల్త్ శాఖ టెండర్లు పిలిచింది. ఈ ప్రాజెక్టు నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బీ) ద్వారా నిర్వహిస్తు న్నారు. రానున్న 30 ఏళ్ల తాగు నీటి అవసరాలను పరిగణనలోకి తీసుకొని పథకాలను అభివృద్ధి చేస్తారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గుంటూరు కార్పొరేషన్‌లో తాగు నీటి సరఫరాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రూ 214.06 కోట్ల వ్యయంతో రక్షిత మంచి నీటి పథకాన్ని విస్తరించనున్నారు. కార్పొరేషన్‌లో విలీనమైన 10 గ్రామాల్లో నీటిని సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. గ్రామాలను కలుపుతూ ప్రధాన పైపు లైన్ నిర్మిస్తారు. దీని నుంచి డిస్ట్రిబ్యూషన్ లైన్‌లు ఏర్పాటు చేశారు. నీటిని శుద్ధి చేసేందుకు 53 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ప్లాంట్‌ను నిర్మించనున్నారు. శుద్ధి చేసిన నీటిని పైపులైన్ ద్వారా ఓవర్‌హెడ్ ట్యాంకులకు సరఫరా చేస్తారు. ఇందుకోసం 10 ఓవర్ హెడ్ ట్యాంక్(ఓహెచ్ఎస్ఆర్)లు నిర్మిస్తారు. ఈ ట్యాంకుల నుంచి ఇళ్లకు కొత్తగా నిర్మించనున్న పైపులైన్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తారు.



బుగ్గవాగు నుంచి నీటి విడుదల (పాత చిత్రం)

మాచర్ల మునిసిపాల్టీ..

మాచర్ల మునిసిపాల్టీలో ఉన్న తాగు నీటి పథకాన్ని విస్తరించనున్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా నీటి సరఫరాను పెంచనున్నారు. ప్రస్తుతం మాచర్లలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం నీటి పథకం విస్తరణకు రూ.109.34 కోట్ల నిధులు విడుదల చేసింది. ప్రస్తుతం క్వారీ పిట్‌ను నీటి నిల్వ చెరువుగా వినియోగిస్తున్నారు. ఈ చెరువులో నీటి నిల్వ సరిపోక ప్రజలు తాగునీటి వెతలను (మిగతా 4వ పేజీలో)



నడికూడి యార్డులో మాట్లాడుతున్న జేడీఏ జగ్గారావు

నాణ్యమైన పత్తి క్వింటాల్ రూ.8,110

- సీసీఐ సదస్సులో వ్యవసాయశాఖ జిల్లా అధికారి

దాచేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కొనుగోలు కేంద్రాల్లో నాణ్యమైన పత్తి క్వింటాల్‌కు రూ.8,110 చెల్లిస్తామని వ్యవసాయశాఖ జిల్లా అధికారి జగ్గారావు తెలిపారు. సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీసీఐ ఆధ్వర్యంలో కిసాన్ యాప్, పీఎం యాప్‌లపై నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రైతులు పత్తిని విక్రయించి మద్దతు ధరను పొందాలన్నారు. పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి సమీపంలోని లక్ష్మీగణపతి కాటన్ మిల్లులో సీసీఐ ద్వారా కొనుగోళ్ల ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో దాచేపల్లి మార్కెట్ యార్డు ఛైర్మన్ బెల్లంకొండ భారతి, పిడుగురాళ్ల వ్యవసాయ సంచాలకులు శ్రీకృష్ణదేవరాయలు, మార్కెటింగ్ ఏడీ కేవీఎన్ ఉపేంద్రకుమార్, యార్డు కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చివరి దశకు చేరిన మరమ్మతులు

- టెయిల్‌పాండ్‌లో ఒక యూనిట్‌లోనే విద్యుత్ ఉత్పత్తి

రెంటచింతల,నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రెండో యూనిట్‌కు సంబంధించి పెన్‌స్టాక్ ఇన్ టేక్ వాటర్ గేట్ మరమ్మతు పనులు చివరి దశకు చేరాయి. భూమి నుంచి 60 అడుగులుండే రిజర్వాయర్ లోపలకు నెల్లూరుకు చెందిన డైవింగ్ నిపుణుల బృందం ఆక్సిజన్ సిలిండర్లతో రంగ ప్రవేశం చేసి లోపాలను గుర్తించింది. మోనో క్రేన్ సహాయంతో పనులు జరుగుతుండగా స్టాప్‌లాగ్ గేట్‌ను తీసేశారు. దీంతో కరెంట్ తయారీకి మార్గం సుగమమైంది. ప్రస్తుతం ఒక యూనిట్ ద్వారా బుధవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 0.5561 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగింది. 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు 4 గేట్లను 1.5 మీటర్ల మేర ఎత్తి 28344 క్యూసెక్కులు టీఆర్‌సీ ద్వారా 4465 క్యూసెక్కులు మొత్తంగా 32809 క్యూసెక్కుల నీరు పులిచింతలకు విడుదల చేస్తుండగా ఎగువన ఉన్న సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 33800 క్యూసెక్కుల నీరు వస్తుంది. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా అది 7.080 టీఎంసీలకు సమానం.



విద్యుత్ ప్రాజెక్టులో జరుగుతున్న మరమ్మతులు

విద్యార్థుల భవితకు ప్రభుత్వం కృషి

- నాణ్యమైన విద్య, సత్ప్రవర్తన అందిస్తాం
- వసతి గృహాల అభివృద్ధికి రూ.400 కోట్లు
- గురుకుల పాఠశాల తనిఖీలో మంత్రి డోలా

అమరావతి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. అమరావతిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలలో గురువారం మంత్రి డోలా ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను తనిఖీ చేశారు. విద్యార్థినులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలు తెలుసుకున్నారు. బోధనా సిబ్బంది హాజరు పట్టికలో ఉదయాన్నే రెండు సంతకాలు చేయడంపై వివరణ కోరారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎంబీబీఎస్ సీటు తెచ్చుకోలేక పోయిన విద్యార్థులకు విజయవాడలో ప్రత్యేకంగా లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. అమరావతి గురుకులంలో సైన్స్ గ్రూప్ ఏర్పాటుపై పరిశీలిస్తామన్నారు. గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన బియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వసతి గృహాల అభివృద్ధికి 16నెలల్లో రూ.400 కోట్లు కేటాయించామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, సత్ప్రవర్తన అందించేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శివబాబు, ప్రిన్సిపాల్ ప్రమీల, ఎస్ఎంసీ ఛైర్మన్ అజీజ్, పీఏసీఎస్ ఛైర్మన్లు భాష్యం జగదీష్, నాగోతు నాగార్జున, డీసీ ఛైర్మన్ వెంకటేశ్వరరావు స్థానిక నాయకుడు ఎం రాజా పాల్గొన్నారు.



పాఠశాలలో హాజరును పరిశీలిస్తున్న మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

ఓటర్ల జాబితాపై దృష్టి సారించాలి

- వర్చువల్ శిక్షణలో ఎన్నికల అధికారి వివేక్ యాదవ్

నరసరావుపేట టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలపై జిల్లా ఎన్నికల అధికారులు దృష్టి సారించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్‌యాదవ్ ఆదేశించారు. ఓటర్ల జాబితా ప్రక్షాళనపై అన్ని జిల్లాల కలెక్టర్లకు గురువారం వర్చువల్‌గా శిక్షణా కార్యక్రమం జరిగింది. కాగా నరసరావుపేటలోని క్యాంపు కార్యాలయం నుంచి ఈ శిక్షణ సమావేశంలో కలెక్టర్ కృతికా శుక్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివేక్ యాదవ్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా రూపకల్పనకు బీఎల్‌వోలు సర్వే చేయాలన్నారు. 2002 ఓటర్ల జాబితాలతో 2025 జాబితాను పోల్చి విచారణ చేయాలన్నారు. ఇంటింటా ఓటర్ల సర్వే జరపాలన్నారు. 2002లో ఓటర్ల జాబితాలో ఉన్న ఓటర్లను తండ్రి పేరుతో అనుసంధానించాలన్నారు. 2004 తర్వాత ఓటర్లుగా నమోదైన వారికి తల్లిదండ్రులు లేదా కుటుంబసభ్యుల ధ్రువీకరణ తప్పనిసరిగా ఉండాలన్నారు. బీ ఎల్‌వోలు ఇంటింటా సర్వే చేపట్టేలా అధికా రులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ ను రాజకీయ పార్టీల భాగస్వామ్యంతో చేపట్టాలన్నారు. నూతనంగా ఓటు హక్కు పొందిన వారికి గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. కలెక్టర్ కృతికాశుక్లా మాట్లాడుతూ జిల్లాలో వలసలు, ఒకటి కంటే ఎక్కువ ప్రదేశాలలో ఓటర్లు నమోదు, చనిపోయిన ఓటర్లను తొలగించడం వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు చెప్పారు. రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి, వారి సూచనలు, ఫిర్యాదులను తీసుకుని ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో డీఆర్‌వో మురళి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.



వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ కృతికాశుక్లా

ప్రమాదకరంగా.. ప్రయాణం

వినుకొండ - అద్దంకి రోడ్డు గోతుల మయం



వినుకొండ: గాంధీనగర్ నుంచి ఏనుగుపాలెం వరకు గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

వినుకొండటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వినుకొండ నుంచి అద్దంకి వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. గత టీడీపీ పాలనలో రోడ్డు నిర్మించారు. ఆ తర్వాత నుంచి నిర్వహణ లేకపోవ డంతో ప్రస్తుతం రోడ్డంతా గోతులతో నిండిపోయింది. వాహనాల తాకిడికి రోడ్డుకు ఇరువైపులా భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహన చోదకులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా భారీ గుంతలు ఏర్పడటంతో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించేం దుకు ద్విచక్ర వాహన దారులు, ఆటోలు, బస్సులకు ఇబ్బంది కరంగా మారింది. ఇక వర్షాల సమయంలో ఆయా గోతు ల్లో నీరు నిలిచి అర్థం కాక ప్రమాదాలు చోటుచేసుకుం టున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ పనులు చేపట్టిన దాఖలాలు లేవు. దీంతో కోటప్ప నగర్ సమీపంలోని అమ్మవారి గుడి వద్ద రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. గాంధీనగర్ నుంచి ఏనుగుపాలెం వరకు రోడ్డుకు ఇరువైపులా గుంతలతో భారీ వాహనాలు రోడ్డు దిగలేని పరిస్థితి నెలకొంది. ఆయా గుంతలు వినుకొండ నుంచి ఒంగోలుకు వెళ్లే ఆర్టీసీ బస్సు డ్రైవర్లకు పెద్ద తలనొప్పిగా మారాయి. గోతులతో పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని వాహన దారులు కోరుతున్నారు. ఈ అంశంపై ఆర్అండ్‌బీ డీఈని వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.



కోటప్పనగర్ సమీపంలో రోడ్డుపై గుంతలు

వ్యభిచార గృహాలపై ఆకస్మిక దాడులు..


వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ సుబ్బనాయుడు, ఎస్ఐ శివరామకృష్ణ

నరసరావుపేట లీగల్, యడ్లపాడు, తెనాలి క్రైం నవంబరు6(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని పల్నాడు రోడ్డులో వ్యభిచార స్థావరంపై గురువారం మొదటి పట్టణ పోలీసులు ఎస్పీ ఆదేశాల మేరకు.. ఆకస్మికంగా దాడి చేశారు. ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులను అదుపులోకి తీసుకున్నారు. సీఐ షేక్ ఫిరోజ్ నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఆన్‌లైన్ వ్యభిచారం గుట్టురట్టు..

యడ్లపాడు పరిధిలో ఆన్‌లైన్ వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ సీఐ సుబ్బనాయుడు విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. యడ్లపాడు గ్రామానికి చెందిన దేవి అనే మహిళ గుంటూరు, విజయవాడకు చెందిన యువతుల ఫొటోలను.. విటులకు పంపించి యడ్లపాడులోని తన నివాసంలో వ్యభిచారం చేయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. సోమవారం రాత్రి ఒక యువతిని, ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. విచారణలో నిర్వాహకురాలు పసుమర్రు గ్రామంలోని ఓ అద్దె ఇంట్లో ఉంటూ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు గుర్తించామన్నారు. బుధవారం ఉదయం దేవిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరచినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ శివరామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలిలో ఇద్దరు యువతులు..

తెనాలి క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెనాలి నాజరుపేటలోని ఓ ఇంటిలో వ్యభిచారం జరుగుతుందన్న సమాచారంతో వన్‌టౌన్ పోలీసులు దాడి చేశారు. విజయవాడ, గుంటూరుకు చెందిన ఇద్దరు యువతులను, ఇద్దరు విటులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వారి నుంచి 4 సెల్ ఫోన్లు రూ.500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ విజయకుమార్ తెలిపారు.

అర్హత లేకున్నా డైట్‌లో అధ్యాపక పరీక్షకు

● చివరి నిమిషంలో అడ్డుకున్న పల్నాడు డీఈవో

గుంటూరు(విద్య), నవంబరు6(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్, బోయపాలెం)లో గురువారం ఆంగ్ల అధ్యాపక పోస్టుకు జరిగిన రాత పరీక్షలో హైడ్రామా చోటుచేసుకుంది. ఇక్కడ అంగ్ల అధ్యాపక పోస్టును (డిప్యూటేషన్ ద్వారా) భర్తీ చేయడానికి ఇటీవల నోటిఫికేషన్ జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో బీఈడీ 55శాతానికి పైగా మార్కులు ఉన్న ముగ్గురు స్కూల్ అసిస్టెంట్ల నుంచి దరఖాస్తులు వచ్చాయి. వారికి హాల్ టిక్కెట్లు కూడా జారీ అయ్యాయి. గురువారం ఉదయం 9 గంటలకు రాతపరీక్ష నిర్వహించడానికి కళాశాల ప్రిన్సిపల్ సన్నాహాలు చేస్తున్న తరుణంలో తాను కూడా పరీక్ష రాస్తానని నూజెండ్ల మండలంలోని ఒక ఉన్నత పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయురాలు డైట్‌కు వచ్చింది. అయితే రాత పరీక్షకు ఆమెకు అర్హత లేదు. పైగా పరీక్షకు దరఖాస్తు కూడా చేయలేదు. అయినా హాల్‌టికెట్ ఎలా తెచ్చుకుందో తెలియక సిబ్బంది..పల్నాడు డీఈవో చంద్రకళ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆమె స్పందించి విచారణ చేయడంతో పల్నాడులో పనిచేసే ఓ అధికారి సిఫార్సుతో హాల్ టికెట్ తెచ్చుకున్నట్లు తేలింది. దొడ్డిదారిన హాల్ టికెట్ తెచ్చుకున్న ఉపాధ్యాయురాలిని పరీక్షకు అనుతించ లేదని, అర్హులైన ముగ్గురికి పరీక్ష నిర్వహించాలని డీఈఓ ఆదేశాలు జారీ చేశారు. అక్రమ మార్గంలో హాల్‌టికెట్ తెచ్చుకున్న ఉపాధ్యాయురాలపై అంతర్గత విచారణకు ఆదేశించడంతోపాటు ఆమెకు సహకరించిన వారిపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేశారు.

రైతు ఖాతా నుంచి రూ.3.84 లక్షలు మాయం

వెల్దుర్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓ రైతు బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.3.84 లక్షలు మాయం చేశారు. దీనిపై బాధిత రైతు గురువారం వెల్దుర్తి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. బాధిత రైతు కథనం మేరకు.. మండలంలోని మండాదికి చెందిన రైతు పాతకోటి సైదారెడ్డికి మాచర్ల పట్టణంలోని కెనరా బ్యాంకులో ఖాతా ఉంది. సైబర్ నేరగాళ్లు రెండు రోజుల క్రితం అతని ఫోన్ హ్యాక్ చేసి, సిగ్నల్ రాకుండా చేశారు. సిగ్నల్ వచ్చిన తర్వాత చూస్తే బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.3.84 లక్షల నగదును కాజేశారంటూ వాపోయాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సమందర్‌వలి తెలిపారు.

కొనసాగుతున్న ఏసీబీ దాడులు

నరసరావుపేట లీగల్, నవంబర్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్త దాడుల్లో భాగంగా రెండవ రోజు గురువారం పట్టణంలో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఏసీబీ తనిఖీలు కొనసాగుతున్నాయి. రిజిస్ట్రేషన్ల విధానం, అవినీతి ఆరోపణలపై డాక్యుమెంట్లను సిబ్బంది పొద్దుపోయే వరకు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. శుక్రవారం పూర్తి వివరాలు వెల్లడి అయ్యే అవకాశం ఉంది.

తొమ్మిది ఇసుక ట్రాక్టర్లు సీజ్

కొల్లిపర, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొమ్మువానిపాలెం, కొల్లిపర, మున్నంగి, వల్లభాపురం, అన్నవరం తదితర గ్రామాల్లో ఇసుక రీచ్‌ల్లో ఎస్ఐ కోటేశ్వరరావు తన సిబ్బందితో కలిసి గురువారం దాడులు నిర్వహించారు. కృష్ణా నది నుంచి బిల్లులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న తొమ్మిది ఇసుక ట్రాక్టర్‌లను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయాలనికి తరలించడంతో.. తహసీల్దార్ సిద్ధార్థ ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5వేలు జరిమాన విధించినట్లు తెలిపారు.

కొలకలూరు విద్యార్థి మృతదేహం లభ్యం


ఒడ్డుకు చేరిన మృతదేహం

తెనాలి క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కొలకలూరులో బుధవారం కొమ్మూరు కాల్వలోకి దూకి గల్లంతైన ఇంజనీరింగ్ విద్యార్థి మృతదేహం లభ్యమైంది. గురువారం సాయంత్రం గుడివాడ యాదవపాలెం వద్ద కాల్వ ఒడ్డుకు శవం కొట్టుకు వచ్చిందని రూరల్ ఎస్ఐ ఆనంద్ తెలిపారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న కొలకలూరుకు చెందిన షేక్ ఖాజావలి (20) ఆత్మహత్య కారణాలు వెల్లడి కాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం మత్తులో లైంగిక వేధింపులు..వ్యక్తి హత్య

పిడుగురాళ్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో తనతో లైంగిక సంబంధం పెట్టుకోమన్న వ్యక్తిని.. మరో వ్యక్తి తన స్నేహితుడితో కలిసి రాళ్ల కొట్టి చంపేశాడు. ఈ ఘటన గత బుధవారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణానికి చెందిన కొమ్ము సంతోషరావు(37), షేక్ సుభాని లెనిన్‌నగర్ సమీపంలోని పాడుబడిన ఇంట్లో మద్యం సేవించారు. సంతోషరావు సుభానిని తనతో లైంగిక సంబంధం పెట్టుకోమని విసిగించడంతో.. ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో సుభాని తన స్నేహితుడు నూర్ బాషా సైదావలిని ఘటనా స్థలానికి రప్పించాడు. సుభాని, సైదావలి ఇద్దరు సంతోషరావుపై రాళ్లతో దాడి చేయడంతో..అతను మృతి చెందాడు. అనంతరం రక్తపు మరకలతో పిడుగురాళ్లలో సుభాని, సైదావలి కనిపించడంతో గస్తీ తిరుగుతున్న పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. జరిగిన ఘటన తెలుసుకొని కేసునమోదు చేశారు.

నేడు 'చలపతి'లో మెగా జాబ్ మేళా

గుంటూరు(విద్య), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు లామ్‌లోని చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కె.సంజీవరావు గుర్వారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా పరిసర ప్రాంతాల్లోని పది, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, బీఫార్మసీ పూర్తిచేసిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్ మేళా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. ఇతర వివరాల కోసం అల్లూరి వెంకట్ (89195 08017)ను సంప్రదించాలని తెలిపారు.

ఘనంగా కొమ్మాలపాటి జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ జన్మదిన వేడుకలు నరసరావుపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని, కేక్ కట్ చేసి కొమ్మాలపాటికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమ్మాలపాటి శ్రీధర్ పార్టీకి అంకితమైన నాయకుడన్నారు. పెదకూరపాడు ఎమ్మెల్యేగా పనిచేసి, ఇప్పుడు జిల్లా అధ్యక్షుడిగా టీడీపీని బలోపేతం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, బులియన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, ఎస్సీ సెల్ డైరెక్టర్ సాతులూరి కుమార్, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి హనుమంతరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, గొట్టిపాటి జనార్దన్‌బాబు, షేక్ మన్నాన్ షరీఫ్, రావర్ల జగ్గారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గట్టుపల్లి సత్యనారాయణ, గోనుగుంట్ల శ్రీనివాసరావు, కనుమూరి అనంతలక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బంగారు దుకాణాలపై బీఐఎస్ అధికారుల దాడులు


దుకాణదారుడికి నోటీసులు అందజేస్తున్న బీఐఎస్ జేడీ అర్జున్

గుంటూరు(తూర్పు), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని పట్నంబజారు, లాలాపేట ఇతర ప్రాంతాల్లోని బంగారు దుకాణాల్లో విజయవాడ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. బంగారు ఆభరణాలపై హాల్ మార్కింగ్ లేకుండా విక్రయించడం, బీఐఎస్ గుర్తింపు లేని నకిలీ యంత్రాలతో ఈ ప్రక్రియ చేయడం వంటి ఫిర్యాదులు రావడంతో ఈ దాడులు జరిపారు. దుకాణాల్లోని యంత్రాలపై ఉండే హాల్‌మార్కింగ్ సెంటర్ గుర్తింపు నంబరు, దుకాణదారుని లైసెన్సు, నగలపై బీఐఎస్ చిహ్నం వంటి అంశాలను పరిశీలించారు. కొన్ని దుకాణాల్లో యంత్రాలపై సరైన వివరాలు ముద్రించకపోవడంతో నోటీసులు అందజేశారు. క్లాత్ బజార్‌లోని ఓ దుకాణంలో లేజర్ మార్కింగ్ మిషన్ ద్వారా హాల్ మార్కింగ్‌ని గుర్తించి సీజ్ చేశారు. అనంతరం బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ టి.అర్జున్ మాట్లాడుతూ బంగారం ధర పెరుగుతున్న నేపథ్యంలో జరుగుతున్న మోసాలపై దృష్టి సారించామన్నారు. హాల్ మార్కింగ్‌పై బీఐఎస్ వారి గుర్తింపు తప్పనిసరి అని అన్నారు. బంగారంలో రాగి, ఇతర లోహాల శాతం ఎంత ఉంది.. రుథేనియం, క్యాడ్మియం, ఇరిడియం వంటి నిషేధిత ద్రావణాలు ఏవైనా.. ఉన్నాయా అని పరిక్షించాలన్నారు. ఇవి అన్ని మినహాయించి బంగారం ఎంత ఉంది అని నిర్ధారించి వినియోగదారునికి వివరాలు అందజేయాలని సూచించారు. స్వచ్ఛత 916, దాని కంటే ఎక్కువ శాతం వస్తే 22 క్యారెట్లు, 875 ఉంటే 18 క్యారెట్లు గోల్డ్ అనే పూర్తి సమాచారం రశీదులో పొందుపరచాలని సూచించారు. చాల మంది కేవలం 22 క్యారెట్లు బంగారంకే హాల్ మార్కింగ్ ముద్ర వేస్తారు అనే అపోహలో ఉంటారని, 14, 16, 18 క్యారెట్లు బంగారానికి కూడా హాల్ మార్కింగ్ ముద్రించుకోనే అవకాశం ఉందని తెలిపారు. ఈ తనిఖీలలో అధికారి కె.సాయి కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి ఏఎన్‌యూలో ఎన్‌సీసీ ఐడియా, ఇన్నోవేషన్ పోటీలు

ఏఎన్‌యూ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అఖిల భారత ఎన్‌సీసీ ఐడియా అండ్ ఇన్నోవేషన్ పోటీలు-2025 జరగనున్నాయి. ఈ పోటీలకు దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి సుమారు 340 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరుకానున్నారు. యువతలో ఆవిష్కరణాత్మక ఆలోచన, సాంకేతిక, వ్యవస్థాపక నైపుణ్యాల అభివృద్ధి ద్వారా ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తిని ప్రోత్సహించడంతో పాటు వికసిత్ భారత్-2047 లక్ష్యానికి తోడ్పడడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశ్యం. పోటీల ద్వారా క్యాడెట్లు సమాజపరమైన, సాంకేతిక అభివృద్ధికి దోహదపడే వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్, లెఫ్టినెంట్ జనరల్ వీరేంద్ర తదితరులు ఈ కార్యక్రమాలకు హాజరుకానున్నారు.

నేడు 'వందేమాతరం'పై ఉపన్యాసం

ఏఎన్‌యూలోని చరిత్ర, పురావస్తుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం 50 సంవత్సరాల వందేమాతరం సందర్భంగా భారత స్వాతంత్రోద్యమం సమయంలో వందేమాతరం ఉద్యమం అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం జరుగుతుందని విభాగాధిపతి ఆచార్య ఎస్.మురళీమోహన్ గురువారం తెలిపారు. ముఖ్య అతిథిగా వర్సిటీ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య గంగాధరరావు, గౌరవ అతిథులుగా రెక్టార్ ఆచార్య శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, కీలకోపన్యాసకులుగా కర్నూలులోని క్లస్టర్ విశ్వవిద్యాలయం చరిత్ర అధ్యాపకులు డాక్టర్ బి.ఆర్.ప్రసాద్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. ఇంజనీరింగ్ కళాశాలలోని ఆచార్య హరగోపాల్‌రెడ్డి సెమి నార్ హాలులో ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభ మవుతుందన్నారు.

లాంలో నేడు..
ఎన్జీ రంగా 125వ జయంతి

●హాజరు కానున్న సీఎం, కేంద్ర, రాష్ట్ర మంత్రులు

గుంటూరు సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధులు, దేశం గర్వించదగ్గ రైతు బాంధవులు, ప్రముఖ పార్లమెంట్ సభ్యులు, పద్మవిభూషణ్ ఆచార్య ఎన్జీ రంగా 125వ జయంతి వేడుకలు శుక్రవారం గుంటూరు సమీపంలోని లాంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరగనున్నాయి. ఈ వేడుకలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చె నాయుడు పాల్గొననున్నారు. వర్సిటీలోని కృష్ణ ఆడిటోరియంలో ఏర్పాట్లను ఎన్జీ రంగా ట్రస్ట్ సభ్యులు రామినేని కిశోర్‌బాబు, టి. యుగంధర్, బి.నాగేశ్వర్‌మిత్రా పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమం పర్యవేక్షణకు రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ పీవీ సత్య నారాయణను ఇన్‌చార్జిగా నియమించారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 25,375 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుండి 31,579 క్యూసెక్కుల వరద నీరు గురువారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా 25,375 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 2011 , పశ్చిమ డెల్టాకు 4012, గుంటూరు చానల్‌కు 181 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

సాగర్ నీటి నిల్వ 312.04 టీఎంసీలు

విజయపురిసౌత్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటి మట్టం గురువారం నాటికి 590.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10 వేల క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5087 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,657 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 49,944 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 60,319 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలలో 44.53 టీఎంసీలు

అచ్చంపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో గురువారం 44.53 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 46,300 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. పవర్ జనరేషన్ ద్వారా 12వేలు, లీకుల ద్వారా 400, ఒక గేటు ద్వారా 20,823, మొత్తం 33,223 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

దాహార్తి దరిచేరకుండా..

(3వ పేజీ తరువాయి)

ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో బుగ్గవాగు నుంచి మాచర్ల చెరువుకు నీటి తరలించేందుకు 27 కిలోమీటర్ల పొడవున పైపులైన్ ఏర్పాటు చేస్తారు. బుగ్గవాగులో ఇన్‌టేక్ వెల్ ఏర్పాటు చేసి మోటార్ల ద్వారా మాచర్లకు తాగు నీటిని తరలిస్తారు. మునిసిపాల్టీలో గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఓవర్ హెడ్ ట్యాంక్ పనులను చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం ఈ పనులను గాలికి వదిలేసింది. ఈ ట్యాంక్‌తో పాటు పైపు లైన్లను కూడా నిర్మించనున్నారు. ఈ పనులకు టెండర్ నిర్వహించారు.

పిడుగురాళ్ల మునిసిపాల్టీలో...

పిడుగురాళ్ల మునిసిపాల్టీలో ఏళ్ల తరబడి నీటి ఇక్కట్లను పౌరులు ఎదుర్కొంటున్నారు. కృష్ణా నది నుంచి పిడుగురాళ్లకు తాగునీటి తరలించేందుకు గతంలో పైపు లైన్ నిర్మించారు. అయితే పైపు లైన్‌పై తరచూ లీకులు ఏర్పడుతూ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. నది నుంచి మోటార్ల ద్వారా నీటిని పంపు చేయడంతో ఈ ఒత్తిడిని పైపులైన్ తట్టుకోలేక పోవడంతో లీకులు ఏర్పడుతున్నాయి. దీంతో కొత్త పైపు లైన్ నిర్మాణం చేపట్టనున్నారు. గ్రావిటీపై నీటిని తరలించేందుకు బుగ్గవాగు నుంచి 42 కిలోమీటర్ల పొడవునా పైప్‌లైన్ నిర్మాణం జరగనుంది. వాగులో ఇన్‌టేక్ వెల్ ఏర్పాటు చేస్తారు. అక్కడే ఓహెచ్‌బీఆర్ నిర్మించి దీనికి బుగ్గవాగు నుంచి నీటిని పంపు చేస్తారు. ఓహెచ్‌బీఆర్ నుంచి పైపులైన్ ద్వారా గ్రావిటీపై పిడుగురాళ్లకు నీటిని తరలించే విధంగా పబ్లిక్ హెల్త్‌శాఖ ప్రాజెక్ట్ డిజైన్ చేసింది. 30 ఎంఎల్‌డీ నీటిని తరలించేందుకు 700 ఎంఎం సామర్థ్యం గల పైపులైన్‌ను నిర్మిస్తారు. గత టీడీపీ ప్రభుత్వంలో మునిసిపాల్టీలో మూడు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణాన్ని చేపట్టగా.. వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఈ పనులను కూడా ప్రభుత్వం పట్టాలెక్కిస్తోంది. ట్యాంకులతో పాటు డిస్ట్రిబ్యూషన్ లైన్లు, 14 ఎంఎల్‌డీ నీటి శుద్ధి ప్లాంట్‌కు మరమ్మతులు చేపడుతున్నారు.

అమరావతి ఓఆర్‌ఆర్‌కు.. తొలిఅడుగు

(3వ పేజీ తరువాయి)

నంబర్లలో భూమి అవసరమవుతుందని తెలిపేలా గెజిట్ నోటిఫికేషన్(3ఏ)లో పేర్కొంది. ఒకటి, రెండు రోజుల్లో గెజిట్‌ను రూపంలో పత్రికల్లో ప్రకటించనున్నారు. కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దారు కార్యాలయాల్లోనూ ప్రజలకు కాపీలను అందుబాటులోకి తేనున్నారు. అభ్యంతరాలు ఉంటే 21 రోజుల్లో భూసేకరణ అధికారికి తెలియజేస్తే.. పరిశీలించి నిర్ణయం తీసుకోనున్నారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం జిల్లాలో రెండు మండలాల్లో 17.230 కి.మీ పొడవున భూమిని సేకరించనున్నారు. ఆయా గ్రామాల్లో ఓఆర్ఆర్ పరిధిలోకి వచ్చే భూముల సర్వేనెంబర్లు, భూ యజమానుల వివరాలను తెలుపుతూ నోటిఫికేషన్ జారీచేశారు. మరో రెండు రోజుల్లో అధికారికంగా పత్రికా ప్రకటన ఇవ్వనున్నారు. ఓఆర్ఆర్ నిర్మాణంలో గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలు అత్యంత కీలకంగా ఉన్నాయి. ఈ జిల్లాల్లో ఎక్కువ మండలాల గుండా ఓఆర్ఆర్ వెళుతోంది. ఎక్కువ గ్రామాల నుంచి భూసేకరణ చేయాల్సి ఉంది. పల్నాడు, ఏలూరు జిల్లాల్లో ఒకటి, రెండు మండలాల నుంచే ఓఆర్ఆర్ వెళుతుండడంతో గెజిట్ ప్రక్రియ త్వరితగతిన పూర్తయింది. కాగా పల్నాడు జిల్లాలో రెండు మండలాల్లో 990 ఎల్‌పీ నెంబర్లు.. రైతులు వివరాలను గెజిట్‌లో పేర్కొన్నారు. అమరావతి మండలంలోని లింగాపురం, ధరణికోట రెవెన్యూ పరిధిలో దిడుగు, నెమలికల్లు గ్రామాల నుంచి 565.87 ఎకరాలు భూమిని సేకరించనున్నారు. ఇందులో 420.14 ఎకరాలు పట్టా, 0.93 ఎకరాలు ప్రభుత్వ, 144.8 ఎకరాలు అసైన్డ్ భూములు ఉన్నాయి. పెదకూరపాడు మండలంలోని ముసాపురం, పాటిబండ్ల, జలాల్‌పురం, కంభంపాడు, తాళ్లూరు, లింగంగుంట్ల, బలుసుపాడు గ్రామాల పరిధిలోని 607.485 ఎకరాలను సేకరించే జాబితాలో చూపించారు. ఇక్కడ 538.1 ఎకరాలు పట్టా, 50.447 ఎకరాలు ప్రభుత్వ, 1.57 ఎకరాలు అసైన్డ్, 17.363 ఎకరాలు ఈనాం భూములు ఉన్నాయి.

కీలకంగా గుంటూరు..

ఓఆర్‌ఆర్‌కు సంబంధించి గుంటూరు జిల్లా అత్యంత కీలకంగా ఉంది. ఈ జిల్లాలో 11 మండలాల్లో భూమిని సేకరించాల్సి ఉంది. ఈ 11 మండలాల్లోని 40 గ్రామాల్లో 67.650 కి.మీ. భూమిని సేకరించాల్సి ఉంది. దీనికి సంబంధించి జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. అది కూడా తుది దశకు వస్తోంది. మరో వారం పది రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని, ఆ వెంటనే గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల అవుతుందని అధికారులు చెబుతున్నారు. కాగా దీనికి సంబంధించిన గెజిట్‌ను అధికారులు గతంలోనే సిద్ధం చేశారు. అందులో కొన్ని తప్పులు దొర్లడంతో వెనక్కి వచ్చింది. దీన్ని కూడా అధికారులు సిద్ధం చేస్తున్నారు. కృష్ణా జిల్లాలో 5 మండలాల్లోని 22 గ్రామాల్లో 35.140 కి.మీ. మేర భూసేకరణ చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ కూడా వేగంగా కొనసాగుతోంది. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి 4 మండలాల్లో 18 గ్రామాల్లో 51.120 కి.మీ మేర భూమిని సేకరించాల్సి ఉంది. ఈ ఐదు జిల్లాల్లో భూసేకరణకు సంబంధించిన గెజిట్ ప్రకటన ఎట్టి పరిస్థితుల్లో నెలాఖరులోగా విడుదల చేస్తామని ఎన్‌హెచ్ఏఐ అధికారులు చెబుతున్నారు.

10, 11న వాటర్ షెడ్ మహోత్సవ్

● పాల్గొననున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు


వెంగళాయపాలెం చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధి శాఖ వాటర్ షెడ్ - పీఎంకేఎస్‌వై జాతీయ సదస్సు (వాటర్ షెడ్ మహోత్సవ్) రెండు రోజుల పాటు గుంటూరులో జరుగుతుందని రాష్ట్ర వాటర్ షెడ్, గ్రామీణ అభివృద్ధి శాఖ సంచాలకులు వై.వి.కె.షణ్ముఖకుమార్ గురువార ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్రశేఖర్ , ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన 130 మంది ప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ నెల 10న గుంటూరు ఐటీసీ హోటల్లో ప్రారంభ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. 11న గుంటూరు జిల్లాలోని వెంగళాయపాలెం గ్రామ పంచాయతీలో జరగనున్న కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు హాజరుకానున్నారని తెలిపారు.

బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ..

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న వెంగళాయపాలెం గ్రామంలోని మంచినీటి చెరువు వద్ద జరగనున్న జాతీయ వాటర్ షెడ్, అమృత్ సరోవర్ అభివృద్ధి కార్యక్రమం నేపథ్యంలో ఏర్పాట్లను గురు వారం గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. సౌత్ డీఎస్పీ భానోదయ, నల్లపాడు సీఐ వంశీధర్, ఎస్‌బీ సీఐ రాంబాబుతో సమావేశమై బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. పలు సూచనలు జారీ చేశారు. బారికేడ్లు చేసి, భద్రత కల్పించాలన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ బృందం భద్రతకు ప్రాధా న్యమిస్తూ, ప్రొటోకాల్ నిబంధ నలను కచ్చితంగా పాటించాలన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.85 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

49,124 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 51,078 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 49,124 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 13,404 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	13500
334	10000	15800	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14300	334	10500	15400
273	----	---	నెంబరు. 5	10000	14500
341	10000	16500	273	---	----
4884	---	---	341	10000	16800
సూపర్ 10	----	---	4884	11000	13800
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15700	తేజ	10000	15500
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	16100
బ్యాడిగి	10500	16500	దేవనూరు డీలక్స్	10500	15500
దేవనూరు డీలక్స్	10000	15300	తాలుకాయలు	5000	8500

మున్సిపల్ సర్వసభ్య సమావేశం

పిడుగురాళ్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ సర్వసభ్య సమావేశం గురువారం చైర్‌పర్సన్ కొత్త వెంకటసుబ్బారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు హాజరై పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి, వాటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆక్రమణలు కొన్నిచోట్ల మాత్రమే తొలగిస్తున్నారని, మిగిలిన చోట్ల ఎందుకు తొలగించడం లేదని సభ్యులు అడిగిన ప్రశ్నకు రోడ్డు విస్తరణకు అవసరమైనంత వరకే ఆక్రమణలను తొలగించడం జరుగుతుందని అధికారులు సమాధానమిచ్చారు. వార్డుల అభివృద్ధిలో అన్ని వార్డులకు సమాన ప్రాధాన్యత కల్పించాలని సభ్యులు చైర్‌పర్సన్ సుబ్బారావును కోరారు. సమావేశంలో కొక్కెర శ్రీనివాసరావు, గుర్రం అపిరెడ్డి, కత్తెరపు వాసుదేవరెడ్డి, మాదాల కిరణ్, జూలకంటి శ్రీరంగరజనిలు తమ వార్డుల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

ఏఐఎం జిల్లా అధ్యక్షుడిగా కొండలరావు

దాచేపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏఐఎం(అంబేద్కర్ ఇండియన్ మిషన్) పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా దాచేపల్లి పట్టణానికి చెందిన కొండవీటి కొండలరావు నియామకపత్రాన్ని అందుకున్నట్టు గురువారం తెలిపారు. ఏఐఎం వ్యవస్థాపక అధ్యక్షుడు వీబీ సునీల్‌కుమార్ నుంచి నియామకపత్రాలు అందుకున్నట్టు వివరించారు. కొండవీటి కొండలరావు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో ప్రతి జిల్లాలో ఏఐఎం నూతన కమిటీలను ఏర్పాటుచేసి దళితుల అభివృద్ధికై కృషి చేస్తామన్నారు.

భానోదయ విద్యార్థుల ప్రతిభ

పిడుగురాళ్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలలో పట్టణంలోని భానోదయ స్కూల్‌కు చెందిన విద్యార్థులు అండర్-12 విభాగం నుండి మూడవ స్థానం సాధించారు. షేక్ నిహాల్, పి సంతోష్, విశాల్ మణికుమార్, మణికంఠ, హర్ష, అనిల్‌లు ఫ్లోర్‌బాల్ పోటీలలో ప్రతిభ కనబరిచి మూడవ స్థానంలో నిలిచినందుకు స్కూల్ డైరెక్టర్ శివారెడ్డి, పిడి ప్రవీణ్, ఉపాధ్యాయులు అభినందించారు.

ముమ్మరంగా ఆధార్ నమోదు

క్రోసూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ పాఠశాలల్లో ప్రారంభించిన కేంద్రాల్లో ఆధార్‌నమోదు ముమ్మరంగా జరుగుతుంది. ఇప్పటివరకు సుమారు 300మందికి ఆధార్ నమోదు గాని, సరవణలుగాని చేశామని ఆధార్ అసిస్టెంట్ మేదర రాఘవరాజు తెలిపారు. గురువారం మండలంలోని బయ్యవరం హైస్కూల్‌లో జరిగిన నమోదు కార్యక్రమంలో సుమారు 30 మందికి ఆధార్ నమోదును చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆపరేటర్ షేక్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి గురైన పార్కుకు మోక్షం

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన లేమల్లెలోని పార్కుకు నేడు మోక్షం కలిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామస్థుల సహకారంతో సర్పంచ్ ఉగ్గం పున్నమ్మ, పంచాయతీ కార్యదర్శి బీ రమేష్ ఆధ్వర్యంలో పార్కును సుందరంగా తీర్చిదిద్దారు. పార్కులో వాకింగ్ ట్రాక్‌ను పునరుద్ధరించారు. స్థానిక కూటమి నాయకులు కూడా సహకారం అందించారు.

న్యూచిట్యాలలో ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు

బెల్లంకొండ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యూచిట్యాల ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో గురువారం ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపు నిర్వహించినట్టు ప్రోగ్రాం ఆఫీసర్ లక్ష్మీసులోచన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్‌లో విద్యార్థులు పాల్గొనటం వల్ల ప్రతి విద్యార్థిలో నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయన్నారు. చిన్ననాటినుంచే సమాజసేవలో భాగస్వాములు కావటం వల్ల ఉత్తమ నాయకులుగా ఎదుగుతారన్నారు. అనంతరం ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లోని స్కూల్, పరిసర ప్రాంతాల్లో ముళ్ళపొదలు, కంపను తొలగించారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు వై రమేష్‌బాబు పాల్గొన్నారు.

వైభవంగా బిర్సా ముండా 150వ జయంతి

మండలంలోని వెంకటాయపాలెం సచివాలయంలో గురువారం బిర్సా ముండా 150వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీడీవో సునీత హాజరయ్యారు. ఎస్టీ కాలనీలో సమస్యలను కాలనీవాసులు ఎంపీడీవో దృష్టికి తెచ్చారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా నాగమ్మబాయి, ఉపసర్పంచ్ దేసు బ్రహ్మం, మేశం శ్రీరామ్మూర్తి, భూక్యా శ్రీనునాయక్, మేశం యలమందారావు పాల్గొన్నారు.

రేపు ప్రజాదర్బార్

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అమరావతిలోని ఇరిగేషన్ శాఖ ప్రాంగణంలో ఈ నెల 8వ తేదీన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నారు. ఉదయం 10గంటల నుండి ప్రారంభమైయ్యే ప్రజాదర్బార్‌లో ప్రజలు తమ వినతులు ఇవ్వవచ్చని పంచాయతీ కార్యదర్శి నాగరాజు తెలిపారు.

గుండెపోటుతో టీడీపీ కార్యకర్త సత్యనారాయణ మృతి

కారంపూడి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కారంపూడికి చెందిన టీడీపీ కార్యకర్త సత్యనారాయణ గుండెపోటు మృతిచెందారు. స్థానిక ఎన్టీఆర్ బొమ్మ సెంటర్‌కు చెందిన సత్యనారాయణ బుధవారం రాత్రి నరసరావుపేట హాస్పిటల్‌కు వెళ్లే క్రమంలో ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణాలు విడిచాడు.

నేడు సత్రశాల శివాలయ అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష

మాచర్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రెంటచింతల మండలం సత్రశాలలో శివాలయం అభివృద్ధిపై దేవదాయ శాఖ, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శుక్రవారం ఉదయం 11 గంటలకు సమీక్ష నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు వెల్దుర్తి క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో పాల్గొననున్నారు. 8వ తేదీన ఉదయం 8:30 గంటలకు ప్రజాదర్బార్‌లో పాల్గొననున్నారు.

డిసెంబరు 13న బైబిల్ క్విజ్

మాచర్ల రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సమర్పణ ప్రార్థనా మందిరంలో డిసెంబర్ 13వ తేదీన పల్నాడు మెగా బైబిల్ క్విజ్ నిర్వహించనున్నట్లు బైబిల్ క్విజ్ కన్వీనర్, పల్నాడు దైవ సేవకుల సహవాసం వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్‌బాబు అన్నారు. బైబిల్‌లోని యోహాను సువార్త, యోహాన్ రాసిన 3 పత్రికలు అంశాలపై క్విజ్ ఉంటుందన్నారు.

గొర్రెలు, మేకల పెంపకం సంఘ సమావేశం

రెంటచింతల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇటీవల తుఫాన్‌కు మృతిచెందిన గొర్రెలు, మేకల పెంపకందారులకు రూ.10వేల నష్ట పరిహారం చెల్లించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పూనపాటి వెంకట్రావ్ డిమాండ్ చేశారు. గురువారం రెంటచింతలలో బోయిన సైదయ్యయాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 19, 20 తేదీలలో మాచర్లలో జరిగే గొర్రెలు, మేకల పెంపకందారుల సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సైదారావు, నాగం వెంకటేశ్వర్లు, కోటయ్య, లింగయ్య, కొండ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేరుకే మండల పరిషత్ సమావేశం

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. మొత్తం 14 మంది ఎంపీటీసీలకుగాను కోరం కావడంతో సంతకాలు పెట్టి ముగించారు. ఎంపీటీసీలంతా గతంలో వైసీపీ తరఫున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పచ్చిరొట్ట ఎరువులను వాడాలి..

ముప్పాళ్ళ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతిలో భూసారాన్ని పెంపొందించుకోవాలంటే పచ్చిరొట్ట పైర్లు, పంట అవశేషాలను కుళ్ళబెట్టుకోవాలని జిల్లా శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి ఎం.అరుణ అన్నారు. గురువారం మండలంలోని మాదల గ్రామ సచివాలయంలో రైతులకు భూమి ఆరోగ్యం, భూసారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవన ఎరువులు వాడకం వలన రసాయన ఎరువుల వాడకం 20శాతం తగ్గుతుందన్నారు. పత్తి కొనుగోలుపై ఏవో ఎస్.శ్రీధర్‌రెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా శిక్షణ కేంద్రం విస్తరణ అధికారి కరీమున్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు నీలిమ పాల్గొన్నారు.

రహదారులపై ఆవుల సంచారం



ప్రధాన రహదారిపైకి చేరిన ఆవులు

మాచర్ల రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారులు ఆవులకు ఆవాసాలుగా మారాయి. ఆవుల యజమానులు వాటిని రాత్రి వేళ వదిలిపెడుతుండడంతో అవి రహదారులపైకి చేరుతున్నాయి. రహదారులపై గుంపులుగా సంచరిస్తున్నాయి. వాహనాలకు అడ్డు తగులుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రాత్రి వేళ రహదారులపైనే పడుకుంటున్నాయి. ఇప్పటికైనా పురపాలక సంఘ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం

సత్తెనపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథిల ఆధ్వర్యంలో శానిటరీ సెక్రటరీలు గురువారం పట్టణంలోని పలు హోటళ్ళలో తనిఖీలు నిర్వహించారు. హోటళ్ళలో నిల్వ ఉన్న ఆహారపదార్థాలను విక్రయించరాదని, ఆయిల్ తిరిగివాడరాదని, ఏ రోజుకారోజు కొత్త ఆయిల్ ఉపయోగించాలన్నారు. ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌లు వాడరాదని, ప్లాస్టిక్ ప్లేట్లలో అల్పాహారం, భోజనాలు ఇవ్వరాదన్నారు. సింగిల్ యూజ్ వాటర్ బాటిల్స్ వాడరాదన్నారు. ఆహారపదార్థాలు తయారుచేసే వంటశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. నిషేధిత ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లు, స్వాధీనం చేసుకున్నారు.

ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు మంజూరు చేయాలి

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని ఎండ్రాయి, వైకుంఠపురం, జూపూడి గ్రామాలలో ఎస్సీ సామాజికవర్గ జనాభా అధికంగా ఉందని ఆ గ్రామాలలో అభివృద్ధికి సీసీ రోడ్లు, డ్రైయిన్‌లు, ఉపాధి తదితర అంశాలపై ఎస్సి సబ్‌ప్లాన్ నుండి నిధులు మంజూరుచేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తరఫున పీఏ శ్రీనివాస్ మంత్రికి వినతిపత్రం అందజేశారు. మంత్రి స్పందిస్తూ బాలవీరాంజనేయస్వామి సబ్‌ప్లాన్ నిధులు రానున్న సంవత్సరంలో మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

సోషల్ మీడియాపై పోలీసు నిఘా

సత్తెనపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాపై సత్తెనపల్లి ప్రాంత పోలీసులు నిఘా ఏర్పాటుచేశారు. వర్గ వైషమ్యాలను రెచ్చగొట్టే పోస్టింగ్‌లను సోషల్ మీడియాలో పెట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయటం, వ్యక్తిగత దూషణలకు దిగటం వంటి పోస్టింగ్‌లను ప్రచారం చేయకూడదని, అలా చేస్తే సోషల్‌మీడియా అడ్మిన్‌లదే బాధ్యతన్నారు. అటువంటి పోస్టర్లను తొలగించాలని, సామాజిక బాధ్యతగా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. నేరచరిత్రగల వారి గ్రూపులో అడ్మిన్‌లుగా ఉన్నవారిని గుర్తించి నోటీసులు జారీచేస్తున్నారు. సోషల్‌మీడియాలో చట్టవిరుద్ధ పోస్టింగ్‌లు పెడితే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు నకరికల్లు విద్యార్థులు

నకరికల్లు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా చీరాలలో ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో నకరికల్లు ఎస్‌వీవీఆర్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన బెల్లంకొండ పావని, కేతినేని కోటేశ్వరరావు పాల్గొంటారని హెచ్‌ఎం జాలాది శ్రీనివాసరావు తెలిపారు. పల్నాడు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నరసరావుపేటలో జరిగిన జిల్లా స్థాయి జూనియర్ పోటీల్లో వీరు ఎంపికైనట్టు తెలిపారు. వీరిని పీడీ వీ ఝాన్సీరాణి, పీ రాజ, విద్యాకమిటీ చైర్మన్ కాసా మల్లికార్జునరావు, సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

డివిజన్ స్థాయి కబడ్డీ పోటీలకు నాగేశ్వరి ఎంపిక



పి.నాగేశ్వరి

రెంటచింతల: మండలంలోని మంచికల్లు జడ్పీ హైస్కూలు 8వ తరగతి విద్యార్థిని పొట్లూరి నాగేశ్వరి కబడ్డీలో డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సిలార్ అహ్మద్ చెప్పారు. అండర్ 17 విభాగంలో గురువారం దుర్గిలో నిర్వహించిన పోటీల్లో విజేతగా నిలిచారన్నారు. ఆమెని ఉపాధ్యాయులు అభినందించారు.

నైపుణ్యంతో ఆడాలి: ఎంఈవో

దుర్గి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మంచి నైపుణ్యంతో ఆట ఆడాలని ఎంఈవో బెంజిమెన్ అన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో గురజాల డివిజన్‌లోని 10 మండలాల అండర్-17 కబడ్డీ పోటీలకు ఎంపికైన టీంలకు గురువారం జిల్లా టీం ఎంపిక నిర్వహించారు. తొలుత క్రీడాకారులతో పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో అడిగొప్పుల హెచ్‌ఎం ఆర్ చంద్రశేఖరరావు, జీసీహెచ్ అనంతరామయ్య, కృష్ణయ్య, గురజాల డివిజన్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ బండ్ల ప్రసాద్, పల్నాడు బీజోన్ వ్యాయామ అధ్యాపకుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎక్స్‌మాస్ జాన్, అనిల్‌కుమార్, ఆర్థిక కార్యదర్శి బీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

మాచర్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యాన గురువారం పట్టణంలోని జడ్పీ బాలురోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. నవంబరు 14 చిల్డ్రన్స్ డే సందర్భంగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాటి భాస్కర్‌బాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం వీర్లాల కొండలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



దుర్గి: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈవో బెంజిమెన్

ఇంటిపన్ను బకాయి వసూళ్లను వేగవంతం చేయాలి

● ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరావు



కార్యదర్శుల సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసరావు

రెంటచింతల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో పేరుకుపోయిన ఇంటి పన్ను బకాయిల వసూలును వేగవంతం చేయాలని ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరావు ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.1కోటి 13లక్షల 47వేలు రావాల్సి ఉండగా ఇప్పటివరకు 60 శాతం మాత్రమే వసూలు చేశారన్నారు. రెంటచింతల పంచాయతీ నుంచి అత్యధికంగా అంటే రూ.39 లక్షలు వసూలు కావాల్సి ఉందన్నారు. అలాగే స్వమిత్వ, కౌశలం,పారిశుధ్యం తదితర అంశాలపై చర్చించి మార్గదర్శకాలను జారీ చేశారు. సమావేశంలో ఈవోపీఆర్డీ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేయాలి



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జై భూన్‌బీ

సత్తెనపల్లి రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీపీ యలవర్తిపాటి షేక్ జైభూన్‌బీ అన్నారు. మండల సాధారణ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగింది. సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌ల సహకారంతో గ్రామాల్లో దోమల నిర్మూలన చర్యలు, పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్, మన మిత్ర గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిదేనన్నారు. ముందుగా వివిధ శాఖల అధికారులు, ఆయా శాఖల ప్రగతి, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సుధారాణి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

క్వింటాల్ పత్తికి మద్దతు ధర రూ.8,110



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కోమటినేని శోభారాణి

సత్తెనపల్లి రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 2025-26 సీజన్‌లో పత్తికి క్వింటా మద్దతు రూ.8,110గా నిర్ణయించిందని మార్కెట్ యార్డు చైర్మన్ కోమటినేని శోభారాణి అన్నారు. వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం ఆమె వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులతో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పత్తి సాగు చేసిన రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో తమ పత్తిని అమ్ముకొని ప్రభుత్వ మద్దతు ధరను పొందాలన్నారు. ఏడీఏ రవిబాబు మాట్లాడుతూ రైతులు, కౌలు రైతులు తమ పంటను ఈ క్రాపు నమోదుచేసిన వారే సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తి అమ్మేందుకు అర్హులన్నారు. ఆయా రైతులు ఆర్‌ఎస్‌కేలలో పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాసుపుస్తకం నకలుతో వీఏఏలను సంప్రదించాలన్నారు. రైతులకు స్లాట్ బుకింగ్ అయిన నిర్ణీత తేదీల్లో పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. సమావేశంలో యార్డు కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, ఏవో బీ సుబ్బారెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీఐ శ్రీనివాసరావుకు సన్మానం



సీఐ శ్రీనివాసరావును సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు, టీడీపీ నేతలు

కారంపూడి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కారంపూడి పట్టణ సీఐ టీవీ శ్రీనివాసరావును గురువారం ఆటో అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్ కార్యవర్గం, టీడీపీ నేతలు కలిసి ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ సమస్యలను ఆయనకు విన్నవించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేత బొల్నేడి శ్రీనివాసరావు, అసోసియేషన్ నేతలు పయ్యావుల శ్రీనివాసరావు, గణితి అమరయ్య, సన్నిధి శ్రీనివాసరావు, కూరపాటి బ్రహ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

● జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు

బెల్లంకొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల్లో జనసేన పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషిచేయాలని ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద మండల పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు ఎవ్వరిని ఎంపిక చేస్తే వారికి సపోర్టు చేసి గెలుపు దిశగా పని చేయాలని సూచించారు. జనసేన పార్టీ మారు మూల గ్రామాల్లో పటిష్ఠ పరిచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీలో అంతర్గత విభేదాలుంటే అందరూ కలసికట్టుగా సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ రామకృష్ణ, పగడాల శ్రీనివాసరావు, సైపుల్లా, భైసు వెంకటరావు, సుభానీ, ముద్దా మంగయ్య, ముద్దా చిన మంగయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఎస్టీయూ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా దొప్పలపూడి, రవికాంత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్టీయూఏపీ జాతీయ ఆర్థిక కార్యదర్శి జోసెఫ్ సుధీర్ బాబు

క్రోసూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): క్రోసూరు మండల ఎస్టీయూ నూతన కార్యవర్గాన్ని ఎంపికచేశారు. అధ్యక్షుడిగా దొప్పలపూడి వెంకటేశ్వరరావు, ప్రధానకార్యదర్శిగా ఎం రవికాంతరెడ్డిని ఎంపికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా టీ పోతయ్యను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా మీరస వ్యవహరించారు. ఎస్టీయూ ఎన్ని కార్యక్రమానికి ఏఐఎస్టీయూఏపీ జాతీయ ఆర్థికకార్యదర్శి జోసెఫ్ సుధీర్‌బాబు హాజరయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఆయన అభినందించారు మండల శాఖ ఆర్థిక కార్యదర్శిగా ఎస్‌డీ నూరుద్దీన్ బాషాను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎల్‌వీ రామిరెడ్డి, ప్రధానకార్యదర్శి చంద్రజిత్‌యాదవ్, ఆర్థికకార్యదర్శి యామండి, జిల్లా నాయకులు కరిముల్లా, సుభానీ, రామ కోటయ్య, సంఘం సీపీఎస్ కన్వీనర్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఐక్యంగా సమస్యలను పరిష్కరించుకోవాలి

ఉపాధ్యాయులు ఐక్యంగా పోరాడి తమ సమస్యలను పరిష్కరించు కోవాలని ఏఐఎస్టీయూఏపీ జాతీయ ఆర్థికకార్యదర్శి జోసెఫ్‌సుధీర్ బాబు అన్నారు. గురువారం క్రోసూరులో ఆయన ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో, జాతీయస్థాయిలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటం చేస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు తమ సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తూ నిరంతరం పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో అనేకమంది రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

9 నుంచి తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

దుర్గి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో ఉన్న శ్రీహరిహర బాలనాగేంద్రస్వామి వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 9వ తేదీ నుంచి తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ఈనెల 9న సబ్ జూనియర్, 10 సేద్యపు, 11 ఆరుపళ్ల విభాగాల్లో పోటీలు జరుగుతాయని కమిటీ సభ్యులు గుండాల వెంకటేశ్వర్లు, ఆకుల రామలక్ష్మయ్య, కొత్తా వెంకటేశ్వర్లు, పలిశెట్టి శ్రీనివాసరావు, పులి హరి తెలిపారు. వివరాలకు సెల్: 7675823570, 8179441885లో సంప్రదించాలన్నారు.

ప్రతి కార్యకర్త కుటుంబానికి పార్టీ అండ

● ఎమ్మెల్యే యరపతినేని



టీడీపీ ప్రమాదభీమా చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పార్టీ అభివృద్ధికి, గెలుపునకు కృషి చేసిన ప్రతి కార్యకర్త కుటుంబానికి పార్టీ అండగా వుంటుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. టీడీపీ సభ్యత్వ నమోదుతో ప్రమాదంలో మృతి చెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున ఎమ్మెల్యే గురువారం పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో, బాధితుల ఇంటికి వెళ్లి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేనివిధంగా కార్యకర్తల సంక్షేమ విభాగాన్ని ఏర్పాటు చేశామని, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్త కుటుంబాన్ని ఆపదలో ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు, లోకేశ్‌లు రూపకల్పన చేశారన్నారు. 8మంది కార్యకర్తల కుటుంబాలకు మొత్తం రూ.40లక్షల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పిల్లి చెన్నారావు, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, గండికోట వెంకటేశ్వర్లు, వడ్డవల్లి సాంబశివరావు, తురకా వీరస్వామి, బడిగుంచల వెంకటేశ్వర్లు, షేక్ సైదా, ముప్పాళ్ల సాంబయ్య, మందా డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి వ్యర్థాల నిర్వహణపై శిక్షణ

దాచేపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపదను తయారు చేసే దానిపై అవగాహన కల్పించేందుకు తడి, పొడి వ్యర్థాల నిర్వహణపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం దాచేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు, సర్పంచ్‌లకు, ఎస్‌ఎస్‌జీ వీఏవోలకు, పీఆర్‌పీలకు శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను, తడి పొడి చెత్తగా వేరు చేసి హరిత రాయబారులకు అందించాలన్నారు. గ్రామాల్లో రహదారులపై, ఖాళీ ప్రదేశాల్లో మురుగు నీరు పారకుండా కాలువల్లో అడ్డంకులు లేకుండా చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ రథాలను ఉపయోగించుకొని పారిశుద్ధ్య గ్రామాలుగా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ ట్రైనర్ బొల్లయ్య, ఏపీవో జయరాజు, ఏవో డీ వీరయ్య పాల్గొన్నారు.

పదిలో మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి

● డీవైఈవో ఏసుబాబు



మాట్లాడుతున్న డీవైఈవో ఏసుబాబు, ఇతర అధికారులు

పిడుగురాళ్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రానున్న పదవ తరగతి పరీక్షా ఫలితాలలో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని డీవైఈవో ఏసుబాబు తెలిపారు. గురువారం స్థానిక జడ్పీ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల మెరుగైన ఫలితాలపై ఎంఈఓలు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, హెచ్‌ఎం కొత్త మల్లికార్జునరావు, ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఇటీవల మండల స్థాయి పోటీలలో గెలుపొందిన పిడుగురాళ్ల జడ్పీ విద్యార్థులను ఆయన అభినందించారు.

మినీ గోకులాల నిర్మాణానికి భూమి పూజ



వేమవరంలో భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

మాచవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమవరం గ్రామంలో గురువారం మినీ గోకులాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో గేదెల కొరకు వీటిని మంజూరు చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఉషారాణి తెలిపారు. అర్హులెవరైనా ఉంటే నిర్మాణాలు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, టీడీపీ సీనియర్ నాయకుడు కొలగాని శివ, ఏసుపొంగు ఆనందరావు, ఫీల్డ్ అసిస్టెంట్ కామిశెట్టి గోపాలరావు తదితరులు ఉన్నారు.

రూపెనగుంట్ల ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

నకరికల్లు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రూపెనగుంట్ల ఫీల్డ్ అసిస్టెంట్ కోనంకి శివగోపీ ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడినట్టు పీజీఆర్‌ఎస్‌లో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం సత్తెనపల్లి క్లస్టర్ ఏపీడీ పీవీ నారాయణ రూపెనగుంట్ల గ్రామంలో విచారణ చేపట్టారు. శివగోపీ తన ఖాతాకు నగదు మళ్ళించుకున్నట్టు ప్రభుత్వ ఉద్యోగుల పేరుతో ఉపాధి పనులకు హాజరుకాకున్నా నిధులను వారి పేరుతో జమ చేసినట్టు ఉద్యాన పంటలకు రైతుల వద్ద నిధులు వసూలు చేసినట్టు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పేరిట ఉపాధి పనులకు హాజరైనట్టు, నగదును వారి ఖాతాల్లో జమ చేసినట్టు, వలంటీర్లకు, వెలుగు యానిమేటర్ల పేరిట, పంచాయతీ గుమస్తా పేరిట ఉపాధి పనులకు హాజరైనట్టు నమోదు చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్టు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు దారులను, లబ్ధిదారులను ఏపీడీ పీవీ నారాయణ విచారించారు. వారినుంచి లిఖిత పూర్వకంగా స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. విచారణలో గుర్తించిన అంశాలన్నింటినీ పల్నాడు జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్‌కు నివేదికను అందజేయనున్నట్టు ఏపీడీ నారాయణ తెలిపారు.

ఘనంగా కొమ్మాలపాటి జన్మదినోత్సవం



కేక్ కట్‌చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు బ్రహ్మయ్య తదితరులు

పెదకూరపాడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ జన్మదినోత్సవాన్ని ఉపసర్పంచ్ జాగర్లమూడి రఘు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య, తెలుగు రైతు జిల్లా ప్రధానకార్యదర్శి బాష్యం ఆంజనేయులు కట్‌చేసి స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడిపూడి రాజు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, ఉప సర్పంచ్ జాగర్లమూడి రఘు, గుంటుపల్లి కోటేశ్వరరావు, టీడీపీ మండల నేతలు షేక్ ముంతాజ్, నల్లపనేని రమేష్, ఘంటా బాబు, మాదినేని సుధాకర్, ఏల్చూరి హనుమయ్య, రామినేని తిరుమల, నాదెండ్ల కల్పన, గుడిపూడి బాబూరావు, షేక్ పులి, కంచర్ల మార్కు, గోగులపాటి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక సాయిబాబా దేవాలయం, ఎస్సీ కాలనీలో జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

● అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ జన్మదిన వేడుకలు అమరావతిలో ఎస్‌బీఎన్ మెడికల్ షాప్ వద్ద భాష్యం ప్రవీణ్ యూత్, కార్పెంటర్స్ సంఘం ఆధ్వర్యంలో వేరువేరుగా నిర్వహించారు. కార్యక్రమంలో జానీబాషా, కార్పెంటర్స్ సంఘ నాయకులు ఖాన్‌సాహెబ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈనెల 4వ తేదీన తాడికొండ మండలంలో రావెల హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా పోటీలలో సత్తెనపల్లి డివిజన్ తరఫున మండలంలోని లేమల్లె జడ్పీ హైస్కూలుకు చెందిన షేక్ అఫ్రీన్, బీ లక్ష్మీప్రియ గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయిని అరుణశ్రీ తెలిపారు. వీరిని హెచ్‌ఎం నీలిమా, సిబ్బంది అభినందించారు.

నేటి నుంచి బాలల పండుగ

● వీవీఐటీయూ బాలోత్సవ్‌కు సర్వం సిద్ధం
● వేడుకలకు వర్సిటీ ప్రాంగణంలో 32 వేదికలు



బాలోత్సవంలో పాల్గొనేందుకు తరలివస్తున్న విద్యార్థులు

పెదకాకాని, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వీవీఐటీయూ బాలోత్సవ్-2025కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సాంస్కృతిక ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీ ప్రాంగణం సిద్ధమైంది. ప్రఖ్యాతిగాంచిన బాలోత్సవ్ వేడుకలు శుక్రవారంనుంచి మూడు రోజులపాటు జరగనున్నాయి. ఇందులో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా 650 పాఠశాలల నుంచి 13 వేల మంది విద్యార్థులు ఇప్పటికే పేర్లు నమోదు చేసుకున్నారు. 20 అంశాలు, 61 విభాగాల్లో పోటీలు నిర్వహించేందుకు వీవీ ఐటీయూ ప్రాంగణంలో 32 వేదికలను ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాలు, దూరప్రాంతాల నుంచి వచ్చే వి ద్యార్థులకు మార్గనిర్దేశం కోసం గుంటూరు, విజయవాడ బ స్టాండు, రైల్వేస్టేషన్లలో సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి.. యూనివర్సిటీకి చెందిన బస్సుల ద్వారా బాలోత్సవ్ ప్రాంగణానికి తరలించనున్నారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ల సమాచారం కోసం డాక్టర్ పుట్టా నాగేశ్వర రావు 9949001586 నంబరుకు సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.



విద్యార్థుల వసతి కోసం..

వసతి కోసం ఇప్పటి వరకు 1,900 మంది బాలురు, 2,800 మంది బాలికలు నమోదు చేసుకోగా అదనంగా 1,500 మందికి వసతి కల్పించేందుకు.. బాలోత్సవ కమిటీ సన్నద్ధంగా ఉంది. వసతిని వినియోగించుకునే విద్యార్థులు దిండు, దుప్పట్లు, జనరల్ మెడిసిన్స్ తమ వెంట తెచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. వసతి కోసం 73862 25336 నంబరుకు సంప్రదించాల్సిందిగా సూచించారు. గుంటూరు, కృష్ణా జిల్లాల విద్యార్థుల కోసం వర్సిటీ బస్సులు 43 రూట్లలో అందుబాటులో ఉంచారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉచిత వసతి, భోజనం సౌకర్యాలను కల్పించనున్నారు. ఆయా రంగాల్లో నిష్ణాతులైన నిపుణులను న్యాయనిర్ణేతలుగా నియమించి, పోటీలలో పాల్గొనే విద్యార్థులకు తగు సూచనలు అందించడం జరుగుతుంది. బాలోత్సవ్ ప్రాంగణంలో వర్సిటీకి చెందిన స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో 600 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేవలను అందించనున్నారు. 180 మంది ఎన్‌సీసీ విద్యార్థులు రక్షణ, భద్రత కోసం కేటాయించారు. ప్రాథమిక చికిత్స అందించేందుకు.. పెదకాకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ క్యాంపును నిర్వహించనుంది. గుంటూరు కిమ్స్, శ్రేష్ఠ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్రం, ఆధునిక అంబులెన్స్‌లను ఏర్పాటు చేస్తున్నారు. విజేతలకు బహుమతులుగా కొండపల్లి విశిష్ట జోడు ఎడ్ల బొమ్మలను అందించనున్నట్లు వర్సిటీ ప్రో చాన్సలర్ వాసిరెడ్డి మహాదేవ్ వెల్లడించారు.

ఆప్కో వస్త్ర నిల్వలతో నూతన డిజైన్లు

● ఫ్రాగ్‌లు, రెడీమెడ్ చీరలు, పంచెలు, క్యారీబ్యాగ్‌ల తయారీ
● స్టాక్ అమ్మకాలతోపాటు మహిళలకు ఉపాధి
● మంగళగిరిలో ఆప్కో గోదాం తనిఖీ చేసిన మంత్రి సవిత



మంగళగిరి ఆప్కో గోదాములోని స్టాకును పరిశీలిస్తున్న మంత్రి సవిత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి సిసోడియా

మంగళగిరి సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆప్కో గోదాముల్లోని చేనేత వస్త్ర నిల్వలతో నూతన డిజైన్లను అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామ పరిధిలోని ఆప్కో గోదాంను గురువారం చేనేత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియాతో కలిసి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాములోని స్టాకు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రూ.15 కోట్ల విలువైన వస్త్ర నిల్వలు ఉన్నాయని ఆప్కో మేనేజర్ మనోజ్‌కుమార్ తెలిపారు. 96 ఆప్కో షోరూంలకు గాను 93 షోరూంల నుంచి రూ.13.48 కోట్లకు పైగా స్టాక్ వెనక్కి తెప్పించామని, మిగిలిన మూడు షోరూంల నుంచి త్వరలోనే స్టాకు రానుందని చెప్పారు. వస్త్ర నిల్వలను పరిశీలించిన మంత్రి సవిత ఆయా వస్త్రాలను గ్రేడింగ్ చేసి విభజించాలని, డ్యామేజీలేని వస్త్రాలను రీసేల్‌కు పంపించాలని ఆదేశించారు. అవసరమైతే ప్రత్యేక రిబేటుపై విక్రయించాలని సూచించారు. అనంతరం మంత్రి సవిత మీడియాతో మాట్లాడుతూ గోదాముల్లోని వస్త్ర నిల్వలతో ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా చిన్నారుల ఫ్రాగ్‌లు, రెడీమెడ్ చీరలు, పంచెలు, క్యారీ బ్యాగులు తయారు చేస్తున్నామని చెప్పారు. తద్వారా స్టాకును విక్రయించడంతోపాటు చేనేత మహిళలకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఇందుకోసం కొందరు డిజైనర్లను నియమించామని, వారితో మహిళలకు రెడీమేడ్ దుస్తులు, క్యారీబ్యాగుల తయారీలో శిక్షణ అందించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఆప్కో గోదాములు, షోరూముల్లో ఉన్న స్టాకును వీలైనంత త్వరగా విక్రయాలు జరపాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. రాజకీయ ఉనికి కోసమే జగన్ డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ రైతులు, బీసీల గురించి జగన్ ఆలోచన చేయలేదని, తుఫాను బాధితులను పరామర్శించిన దాఖలాలు లేవని విమర్శించారు. బీసీలను తీవ్రంగా వేధించిన వ్యక్తి జగన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ అసమర్థ పాలనను విమర్శించినందుకు ఎంతో మంది బీసీ నేతలపై తప్పుడు కేసులు బనాయించి, జైల్లో అక్రమంగా బంధించారని ఆరోపించారు. కల్తీ మద్యం కేసులో జోగి రమేష్ అరెస్టుతో జగన్‌కు బీసీలు గుర్తుకొచ్చారని, బీసీ కార్డుతో జగన్ డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నాడని, ఆయనను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని మంత్రి సవిత అన్నారు.

వీరాంజనేయునికి 38 కేజీల వెండి ఆభరణాలు

❖ బహూకరించిన దాత శరవణ నరేంద్రకుమార్
❖ ఎమ్మెల్యే నరేంద్రకుమార్ ద్వారా ఆలయానికి అందజేత

పొన్నూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో ప్రసిద్ధి చెందిన వీరాంజనేయస్వామి ఆలయానికి గుంటూరుకు చెందిన ఓ భక్తుడు 38 కేజీల వెండి ఆభరణాలను గురువారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ హాజరయ్యారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా గుంటూరుకి చెందిన దాత శరవణ నరేంద్రకుమార్ 38.282 కేజీల వెండి ఆభరణాలను దేవాలయ అధికారులకు అందజేశారు. ఇందులో స్వామికి 8.244 కేజీల హారం, 3.497 కేజీల నాన్‌తాడు, నామం, కళ్లు, యజ్ఞోపవీతం, 4.778 కేజీల తమల పాకులు, 5.388 కేజీల మకరతోరణం, ఉత్సవమూర్తి కిరీటాలు, గంట, 3.243 కేజీల సీతారాముల విగ్రహాలు ఉన్నాయి. అనంతరం ఎమ్మెల్యే నరేంద్రకుమార్.. దాత శరవణ నరేంద్రకుమార్, జయలక్ష్మి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆంజనేయస్వామి ఆలయం విశిష్ట ప్రాశస్త్యం కలిగి ఉందన్నారు. ఎందరో దాతలు సమకూర్చిన విరాళాలను ఆలయ అభివృద్ధికి వినియోగించేందుకు పాటుపడినట్లు తెలిపారు.ఆలయానికి ఇప్పటికే ఆదాయం పెరిగిందని మరింత ఆదాయం పెరిగేలా నూతన పాలకవర్గం పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ జీఎంఎస్ గుప్తా, ఈవో గద్దె వెంకట అమర్‌నాథ్, మాజీ చైర్మన్ చీమకుర్తి నాగభూషణరావు, కూటమి పార్టీల నాయకులు, ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.



గుంటూరు భక్తుడు శ్రీ వీరాంజనేయ స్వామికి సమర్పించిన వెండి ఆభరణాలు



ఎమ్మెల్యే నరేంద్ర సమక్షంలో దేవాదాయ శాఖ అధికారులకు ఆభరణాలు అప్పగిస్తున్న భక్తుడు నరేంద్ర కుమార్

త్వరలో కౌశలం పరీక్షలు

◆ అన్ని కంపెనీలకు ఒకే ప్రశ్న పత్రం
◆ ఆన్‌లైన్ ద్వారా ఇంటి పన్ను వసూలు ◆ డీఎల్‌పీఓ పద్మ



వేమూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం ప్రవేశ పెట్టిన వర్క్ ఫ్రం హోం (కౌశలం) విధానాన్ని అమలు చేసేందుకు త్వరలో ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించనుందని రేపల్లె డివిజన్ పంచాయతీరాజ్ శాఖ అధికారి పద్మ తెలిపారు. గురువారం ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. రేపల్లె డివిజన్ పరిధిలోని 9 మండలాల్లో 175 గ్రామ పంచాయతీలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం 29,024 మంది నిరుద్యోగ యువత ఉండగా.. వర్క్ ఫ్రం హోమ్ సర్వే ఆధారంగా 17,861 మంది వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు చెప్పారు. ఉద్యోగం చేస్తూ రిజిస్టర్ చేయించుకునేందుకు 340 మంది నిరాకరించారని, 1,131 మంది సర్వేలో తమ పేర్లను పొందుపరిచేందుకు ఆమోదం తెలపలేదని వెల్లడించారు. 14 మంది మృతి చెందగా.. 9,678 మంది అందుబాటులో లేని కారణంగా సర్వే జాబితాలో వారిని చేర్చలేకపోయామన్నారు. ఇటీవల కాలంలో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న 3,759 మంది పేర్లనూ ఆన్‌లైన్‌లో పొందుపరిచామని వివరించారు. రిజిస్టర్ అయిన వారికి ప్రభుత్వం ప్రత్యేకంగా త్వరలో పరీక్ష నిర్వహిస్తుందని, అన్ని కంపెనీలకు చెందిన ఒకే పరీక్ష పేపర్ ఇవ్వడం జరుగుతుందన్నారు. పేపర్‌ను అన్ని కంపెనీలకు పంపి ప్రభుత్వమే వాటిని ఫైనల్ చేస్తుందన్నారు. ప్రభుత్వం పరీక్ష తేదీ ప్రకటించిన అనంతరం.. ఆన్‌లైన్ పాస్‌వర్డ్ లాగిన్ చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. దాని ద్వారా పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు. ఇంకా ఎవరైనా ఆసక్తి ఉంటే.. పేర్లు రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు.

ఆన్‌లైన్ విధానంలో ఇంటి పన్ను

స్వర్ణ పంచాయతీ టైటిల్‌పై పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే ఇంటి పన్ను వసూలు విధానాన్ని ఏడాది నుంచి అమలులోకి తీసుకురావడం జరిగిందని డీఎల్‌పీఓ తెలిపారు. డివిజన్‌లోని 175 పంచాయతీల్లో ఈ విధానం నూరుశాతం అమలు చేసేందుకు ఇంటి యజమాని పేరు, మొబైల్ నంబర్‌కు నంబర్లకు అనుసంధానం చేస్తూ వార్డుల వరుస క్రమంలో ఆన్‌లైన్ చేశామన్నారు. డిమాండ్ నోటీసులను కూడా మొబైల్ నంబర్లకు పంపుతున్నామని చెప్పారు. డివిజన్‌లో 1,24,152 గృహాలు ఉన్నాయన్నారు. పాత బకాయి రూ.1.09 కోట్లు, 2025-26 ఆర్థిక సంవత్సరానికి వసూలు చేయాల్సిన రూ.8 కోట్లు వెరశి రూ.9.09 కోట్లకు రూ.20 లక్షల పన్ను మాత్రమే వసూలు చేయడం జరిగిందన్నారు.

పసుపు ధరలు పైపైకి...

◆ నాలుగు నెలల్లో క్వింటాల్‌కు రూ.4వేలు పెరుగుదల

దుగ్గిరాల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పసుపు ధర అనూహ్యంగా రెండు రోజుల్లో వ్యవధిలో క్వింటాకు రూ.2 వేలు పెరిగింది. బంగారం కంటే వేగంగా వారంలో రూ.4 వేల పెరుగుదల నమోదైంది. గత శుక్రవారం జరిగిన వేలంలో క్వింటా గరిష్ఠ ధర రూ.12,500 వరకు పలకగా సోమవారం ఒక్కసారిగా రూ. 13,900కు పెరిగింది. గురువారం తక్కువ సంఖ్యలో విక్రయాలు జరిగినప్పటికీ క్వింటా రూ.12,500 లెక్కన కొనుగోళ్లు జరిగాయి. రెండేళ్ల క్రితం రూ.14 వేలుగా ఉన్న పసుపు ధర క్రమేపీ.. క్షీణిస్తూ, గరిష్ఠంగా రూ.9వేలు, కనిష్ఠంగా రూ.7 వేలకు దిగజారింది. వ్యాపారులు సైతం నష్టాల బాటపట్టారు. రైతులు ఒక దశలో ఎకరాకు రూ.75వేల వరకు నష్టపోయారు. వరుసగా వరదలు, తుఫాన్‌లతో సతమతమైన పసుపు రైతుకు పెరుగుతున్న పసుపు ధరలు ఒకింత ఊరటనిస్తున్నాయి.

దెబ్బతిన్న పసుపు పంట

ఏడాదిలో ఒక పర్యాయమైనా వస్తున్న వరద లంక గ్రామాల్లో పసుపు దిగుబడిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతూ వచ్చాయి. దీంతో రైతులు పసుపు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లడంతో సాగువిస్తీర్ణం కూడా తగ్గింది. ధరలు పూర్తిగా పతనం కావడంతో.. దుగ్గిరాల యార్డుకు అధికంగా పసుపు తీసుకువచ్చే కొల్లూరు, కొల్లిపర, దుగ్గి రాల మండలాల పరిధిలో ఈ ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఏటికేడు ధర పెరుగుతుందని రైతు ఎదురు చూసినప్పటికీ ఫలితం లేకపోయింది. చివరికి కోల్డ్ స్టోరేజీలు, గోదాముల్లో రైతులు, వ్యాపారులు నిల్వ ఉంచిన పసుపును క్వింటాల్‌కు రూ.4 వేలు నష్టానికి కూడా తెగనమ్ముకోవాల్సి వచ్చింది. పంటపై రుణాలు తీసుకున్న రైతులకు నోటీసులు రావడంతో సగం ధరకే అమ్ముకోవాల్సి వచ్చింది.

తగ్గిన దిగుబడి..పెరిగిన ధర

ఆగస్టులో క్వింటాల్ రూ.8 వేలున్న పసుపు ధర రెండు నెలల్లో రూ.6వేలు పెరిగి రూ.13 వేలకు చేరువకావడంతో 2010 నాటి పూర్వవైభవం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. వర్షాలకు పసుపు పంట చాలాచోట్ల దెబ్బతినడంతో 2026 ఏప్రిల్ సీజన్‌కి.. ఎగుమతి అవసరాలకు సరిపడా పసుపు దిగుబడి మార్కెట్‌కు వచ్చే అవకాశం లేనందునే ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.



పసుపు కొమ్ములు, కాయను గ్రేడింగ్ చేస్తున్న మహిళా హమాలీలు

బెల్ట్ షాపులు లేకుండా నిర్మూలించాలి

● అధికారులను ఆదేశించిన ఎక్సైజ్ శాఖ గుంటూరు డీసీ శ్రీనివాసులు

గుంటూరుకార్పొరేషన్,నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు పల్నాడు జిల్లాలలో మద్యం బెల్టు షాపులు లేకుండా నిర్మూలించాలని ఎక్సైజ్ శాఖ గుంటూరు డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఎక్సైజ్ శాఖ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కే శ్రీనివాసులు మాట్లాడుతూ వైన్ షాపులు, బార్లు నిబంధనలు పాటించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమయానికి షాపులు మూయడం, సమయ పాలన పాటించే విధంగా చూడాలన్నారు. మద్యం దుకాణాలలో ఎటువంటి వైలేషన్ లేకుండా చూడాలని ఆదేశించారు. అన్ని మద్యం సీసాలను స్కానింగ్ చేసి మాత్రమే అమ్మవలసిందిగా సూచించారు. కార్యక్రమంలో గుంటూరు, పల్నాడు జిల్లాల ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.


రాజ్‌భవన్ నిర్మాణానికి టెండర్లు

● నమూనా విడుదల చేసిన ఏపీసీఆర్‌డీఏ
● రూ. 162.40 కోట్ల అంచనావిలువతో నోటిఫికేషన్
● 12 నెలల్లో నిర్మాణానికి గడువు విధింపు

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో గవర్నర్ నివాసం (రాజ్‌భవన్) నిర్మాణానికి ఏపీసీఆర్‌డీఏ వేగం పెంచింది. తాజాగా డిజైన్, లేఅవుట్‌ని విడుదల చేస్తూ టెండర్ నోటిఫికేష న్‌ని విడుదల చేసింది. సువిశాలంగా నిర్మించబోయే రాజ్‌భవన్‌కు రూ. 162.40 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేసి టెండర్లు పిలి చింది. 12 నెలల (ఏడాది) వ్యవధిలోనే పనిని పూర్తి చేయాలన్న షర తుని విధించింది. స్పెషల్ క్లాస్ సివిల్ రిజిస్ట్రేషన్ సంస్థలకే టెండర్లలో పాల్గొనే అర్హత కల్పించింది. మూడు నెలల్లో టెండర్ల ప్రక్రియని ఖరారు చేసి ఏజెన్సీని ఎంపిక చేసిన తర్వాత పనులను ప్రారంభింప చేయనుంది. దీంతో అటు ప్రైవేటు, ఇటు ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు రాజధానిలో వేగవంతంగా అడుగులు పడుతున్నాయి.

ఏ రాష్ట్రంలోనైనా రాజ్‌భవన్ తలమానికంగా ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లో రాజ్ భవన్ ఉండేది. రాష్ట్రం విడిపోయాక విజయవాడలో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. అక్కడి నుంచే ఇప్పటివరకు నియామకం పొందిన గవర్నర్లు కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. అయితే అమరావతి రాజధానిలో శాశ్వత రాజ్‌భ వన్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గవర్నర్ మ్యాన్షన్, అసెంబ్లీ దర్బార్ హాల్, గవర్నర్ ఆఫీసు, రెండు అతిథిగృహాలు, ఆరు ఆఫీసర్ క్వార్టర్లు, 10 సీనియర్ స్టాఫ్ క్వార్టర్లు, 12 జూనియర్ స్టాఫ్ క్వార్టర్స్, 40 సపోర్టింగ్ సిబ్బంది నివాసాలు, 20 బరాక్స్, 144 బరాక్ వసతి, సరిహద్దు ప్రహరీగోడ, నాలుగు సెంట్రీ పోస్టులు వంటివి ఈ రాజ్‌భవన్‌లో నిర్మించనున్నారు. గ్రాండ్ లాన్ కూడా పచ్చదనం కోసం ఏర్పాటు చేస్తారు. సువిశాలమైన పార్కింగ్ స్థలాలు అభివృద్ధి చేస్తారు. అంతర్గత రోడ్లు కూడా విశాలంగా నిర్మిస్తారు.

ఈ రాజ్‌భవన్ దేశంలోని ఇతర రాష్ట్రాల గవర్నర్ల నివాసాలను తలదన్నేలా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. దీనికి సంబంధించిన లేఅవుట్, డిజైన్(ఫ్రంట్, బ్యాక్ ఎలివేషన్)లను టెండర్ నోటిఫికేషన్‌లో పొందుపరిచారు. రాజ్‌భవన్ నిర్మాణం పూర్తి అయితే అమరావతి రాజధానికి కొత్త సొబగులను అద్దుతుంది. గవర్నమెంట్ కాంప్లెక్స్‌కు సమీపంలోనే దీనిని నిర్మిస్తారని అధికారవర్గాలు తెలిపాయి.



రాజ్‌భవన్ నమూనా

శబరిమల యాత్రకు ప్రత్యేక రైళ్లు

● నేటి ఉదయం 8 గంటల నుంచి బుకింగ్ ప్రారంభం

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు, జనవరి నెలల్లో శబరిమల యాత్రకు వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం గుంటూరు మీదగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైళ్లన్నింటికి శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి అడ్వాన్స్ బుకింగ్ ప్రారంభమవుతాయన్నారు.

- 07103 మచిలీపట్నం - కొల్లం స్పెషల్ డిసెంబరు 5, 12, 19, జనవరి 9, 16 తేదీల్లో(శుక్రవారం) ఉదయం 11 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.15కి గుంటూరు, 2.58కి నరసరావుపేటకు చేరుకుంటుంది.
- 07104 కొల్లం - మచిలీపట్నం స్పెషల్ డిసెంబరు 7, 14, 21, జనవరి 11, 18 తేదీల్లో(ఆదివారం) వేకువ జామున 2.30 గంటలకు బయలుదేరి సోమవారం ఉదయం 7.03కి నరసరావుపేట, 8.05కి గుంటూరు, మధ్యాహ్నం 12.30కి మచిలీపట్నం చేరుకొంటుంది.
- 07107 చర్లపల్లి - కొల్లం స్పెషల్ నవంబరు 17వ తేదీ నుంచి జనవరి 19 వరకు ప్రతి సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి 2.47కి నడికుడి, 3.08కి పిడుగురాళ్ల, 3.37కి సత్తెనపల్లి, 5.20కి గుంటూరు, 6.50కి తెనాలి చేరుకుటుంది.
- 07108 కొల్లం - చర్లపల్లి స్పెషల్ ఈ నెల 19 నుంచి జనవరి 21 వరకు ప్రతి బుధవారం వేకువజామున 2.30 గంటలకు బయలుదేరి గురువారం వేకువజామున 3.57కి గుంటూరు, 5.12కి సత్తెనపల్లి, 5.38కి పిడుగురాళ్ల 6.01కి నడికుడి, ఉదయం 10.30కి చర్లపల్లి చేరుకొంటుంది.

ఇవేకాకుండా తెనాలి, బాపట్ల, చీరాల మార్గంలో 07101 మచిలీపట్నం - కొల్లం నవంబరు 14 నుంచి జనవరి 2వ తేదీ వరకు ప్రతి శుక్రవారం, 07102 కొల్లం - మచిలీపట్నం స్పెషల్ నవంబరు 16 నుంచి జనవరి 4వ తేదీ వరకు ప్రతి ఆదివారం ప్రయాణిస్తాయి. నవంబరు 16 నుంచి జనవరి 18 వరకు ప్రతి ఆదివారం 07105 నరసపూర్ - కొల్లం, నవంబరు 18 నుంచి జనవరి 20 వరకు ప్రతి మంగళవారం 07106 కొల్లం - నరసపూర్ స్పెషల్స్ కూడా తెనాలి, బాపట్ల, చీరాల మీదగా ప్రయాణిస్తాయి.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

విడదల రజిని అనుచరుల మోసంపై ఫిర్యాదు.. రెండు కేసుల నమోదు

చిలకలూరిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి విడదల రజిని అనుచరులు, పీఏలు ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసంచేసి డబ్బులు తీసుకున్నారని చేసిన ఫిర్యాదుల మేరకు చిలకలూరిపేట రూరల్ పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన షేక్ మాబుసుభాని, వడ్డెరపాలెంకు చెందిన తన్నీరు వెంకటేశ్వరరావులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో చెరో రూ.10లక్షల మేరకు మోసపోయామని పేర్కొన్నారు. ఈ రెండు కేసులలో రజిని అనుచరులు బత్తుల శ్రీగణేష్, కుమారస్వామి, పీఏలు దొడ్డా రామకృష్ణ, మానుకొండ శ్రీకాంత్‌రెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మురుగు నీరు తొలగింపు

'ఆంధ్రజ్యోతి'కి స్పందన

ఈపూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చెర్లలోని బీసీ కాలనీలో పాఠశాల పక్కన సైడుకాలువ ఆక్రమణకు గురికావడంతో మురుగునీరు ఎటూ పోలేక కుంటలా మారింది. సోమవారం ఆంధ్రజ్యోతిలో ఈ విషయంపై కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన పంచాయతీ అధికారులు ఎక్స్‌కవేటర్ సాయంతో ఆక్రమణలు తొలగించి మురుగునీటిని బయటకు పంపి, కాలువలో మట్టి తొలగించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిద్దలింగమూర్తి

మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కష్టపడాలి: డ్వామా పీడీ

ఈపూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వినుకొండ నియోజకవర్గాన్ని జిల్లాలో మోడల్‌గా చూపించేందుకు చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు చేస్తున్న కృషికి మనమందరం సహకరించాలని నియోకవర్గం పీ4 ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ సిద్దలింగమూర్తి అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సచివాలయాల అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో ఉమాదేవి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

భ్రమర జెనిత్ సిటీ సమస్యలపై విచారణ

వినుకొండటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చీకటీగలపాలెం పంచాయతీ పరిధిలోని శ్రీభ్రమర జెనిత్ సిటీ సమస్యలపై గురువారం అధికారుల బృందం విచారణ జరిపింది. డివిజనల్ పంచాయతీ అధికారి వి.వి.యం. లక్ష్మణ్‌రావు, డిప్యూటీ ఎంపీడీవో జి.సుందర్‌రెడ్డి, జెనిత్ సిటీ అసోసియేషన్ అధ్యక్షుడు మేడ వెంకటఅశోక్, కార్యదర్శి బీజం కృష్ణారెడ్డి తదితర సభ్యులు పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి ప్రాంతంలో ఉన్న సమస్యలపై చర్చించారు. తదనంతరం వారు జెనిత్ సిటీలో కూలిన గోడలు, ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు, విద్యుత్ కనెక్షన్ లేని ఓవర్ హెడ్ ట్యాంక్ మోటార్లు, ఉపయోగించకుండా వదిలేసిన కమ్యూనిటీ భవనం స్థలాన్ని పరిశీలించారు. గత నెల 18వ తేదీన జెనిత్ సిటీ అసోసియేషన్ సభ్యులు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సమర్పించిన ఫిర్యాదుపై ఈ విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

నరసరావుపేట టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పేదలకు తక్కువ ధరకు నాణ్యమైన ఆహారం అందించడంలో అన్న క్యాంటీన్లు కీలకపాత్ర పోషిస్తున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గురువారం నరసరావుపేట పట్టణంలో మూడు అన్న క్యాంటీన్లను ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ చేసి, అల్పాహారం నాణ్యత పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు వెంట బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, అంకమ్మచౌదరి, క్రాంతి పాల్గొన్నారు.

బీసీ రక్షణ చట్టం అమలు చేయాలి: బాదుగున్నల శ్రీనివాసరావు

రొంపిచర్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ రక్షణ చట్టం అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీనివాసరావు గురువారం కోరారు. మండల కేంద్రమైన రొంపిచర్ల బీసీ కాలనీలోని భగత్‌సింగ్ భవన్‌లో కార్యవర్గ సమావేశం జరిగింది. శ్రీనివాసరావు మాట్లాడుతూ వచ్చే ఏడాది జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గాలి సాంబశివరావు, కోనేటి నరసింహారావు, కనిగిరి బాల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంతో గ్రామాల అభివృద్ధి: యరమాసు

శావల్యాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధిపథంలో తీర్చిదిద్దడంతో పాటు వేసవిలో పనులు లేక ఇబ్బందులు పడుతున్న పేదలకు జీవనోపాధిని కల్పిస్తుందని టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు యరమాసు కోటేశ్వరరావు అన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టవలసిన అభివృద్ధి పనులపై మండలంలోని కారుమంచి, గుంటుపాలెం గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య, ఇన్‌చార్జి ఏపీవో ఆంజనేయరాజు, ఇన్‌చార్జి సర్పంచ్ మల్లాపరపు బాబూరావు, సొసైటీ చైర్మన్ గోపాళం శివప్రసాద్, ఎంపీటీసీ యూనిట్ ఇన్‌చార్జి కోటా హరిబాబు, డిప్యూటీ ఎంపీడీవో యాకోబు, పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, ఫీల్డ్ అసిస్టెంట్లు వెంకటేశ్వర్లు, శ్రీను పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా ప్రధాన రహదారులు

● ప్రమాద నివారణ చర్యలు శూన్యం
● ప్రమాద సూచికలు, వేగ నిరోధకాలు నిల్



రోడ్డు వెడల్పుగా లేక ప్రమాదాలు జరుగుతున్న పసుపులేరు బ్రిడ్జి

వినుకొండ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. రాత్రివేళల్లో మితిమీరిన వేగంతో ప్రయాణిస్తుండటంతో అత్యధిక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వినుకొండ పట్టణ శివారు ప్రధాన రహదారులపై జరిగే రోడ్డు ప్రమాదాల కారణంగా గడిచిన నాలుగేళ్ల కాలంలో అత్యధికంగా ప్రాణాలు కోల్పోయి పలు కుటుంబాలు రోడ్డునపడ్డాయి.

వినుకొండ పట్టణ సమీపంలోని ఎన్‌హెచ్544డీ పరిధిలోని ప్రమాద వివరాలను పరిశీలిస్తే కారంపూడి రోడ్డులోని చెక్కవాగు లోలెవల్ చప్టాలో ఐదు ప్రమాదాలు సంభవించగా 2021లో ఒకరు మృతిచెందారు. తంగిరాల మెట్టలో 25 ప్రమాదాలు చోటు చేసుకోగా 2022లో ఒకరు మృతి చెందారు.

పసుపులేరు బ్రిడ్జిలో 2021లో 5, 2022-2, 2023-3 మొత్తం పది ప్రమాదాల్లో 2021లో ముగ్గురు, 2022లో ఒకరు, 2023లో ఇద్దరు 2024లో ఇద్దరు, 2025లో ముగ్గురు చొప్పున మొత్తం 11మంది ఆ ప్రాంతంలో మృతిచెందారు. చీకటీగలపాలెం సమీపంలో జరిగిన ప్రమాదంలో మరో ఇద్దరు, అందుగుల కొత్తపాలెం సమీపంలో మొత్తం 14 ప్రమాదాల్లో 12మంది మృతిచెందారు.



అత్యధిక ప్రమాదాలు జరిగిన మార్కాపురం రోడ్డులోని రైల్వేబ్రిడ్జి ప్రాంతం

చెక్కవాగు సమీపంలో ఒకరు, పసుపులేరు బ్రిడ్జి వద్ద ముగ్గురు, చీకటీగలపాలెం సమీపంలో ఏడుగురు, బాలాజీ ఎస్టేట్ వద్ద నలుగురు మృతిచెందినట్లు రికార్డుల్లో నమోదయ్యాయి. ప్రమాదానికి ప్రధానకారణం అతివేగం. ఏ మలుపు దగ్గర ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుందన్నది ప్రయాణికులు గమనించకపోవడంతో, జరిగిన ప్రమాదాల్లో పలువురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ప్రధానంగా పసుపులేరు బ్రిడ్జితో పాటు రైల్వే బ్రిడ్జి నుంచి పసుపులేరు బ్రిడ్జి వైపు ప్రయాణిస్తున్న ప్రాంతంలో అత్యధికంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో హెచ్చరిక బోర్డులు లేకపోవడం, మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్న వాహనదారులకు నివారణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకొని ఎందరో అమాయకుల ప్రాణాలు పోయాయి. నేషనల్ హైవే అధికారులు అత్యధిక ప్రమాద ప్రాంతాలైన చెక్కవాగు, తంగిరాలమెట్ట, కొత్తపాలెం వద్ద ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

నరసరావుపేటలో రూ.62లక్షల విలువైన పనులకు శ్రీకారం

నరసరావుపేట టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో రూ.62 లక్షల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురువారం చేశారు. 11వ వార్డు సీబీఐటీ స్కూల్ లైన్‌లో రూ.55 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఇందులో పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ గ్రాంటు రూ.25లక్షలు, బీపీఎస్-ఎల్‌ఆర్‌ఎస్ గ్రాంటు రూ.30 లక్షలతో కలిపి మొత్తం రూ.55లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, డ్యూయల్ డ్రెయినేజీ వ్యవస్థకు శంకుస్థాపన చేశారు. ప్రతి వీధిలోనూ నీరు నిలవకుండా, వాహనాలు సునాయాసంగా ప్రయాణించేలా చేయడమే లక్ష్యం అని ఎమ్మెల్యే అన్నారు. 15వ వార్డు కొండలరావుపేటలో మున్సిపల్ జనరల్ ఫండ్‌తో రూ.7 లక్షలతో నిర్మించిన 400 మీటర్ల సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంత్‌రావు, డీఈ షేక్ మహమ్మద్ రఫీక్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రీడల్లో సంసిద్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపాల్ సాగర్‌బాబు

శావల్యాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 5న జరిగిన జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో, కోటప్పకొండ జడ్పీ పాఠశాలలో ఈ నెల 4న జరిగిన డివిజన్‌స్థాయి క్రీడల్లో శావల్యాపురం మండలం కనమర్లపూడి సమీపంలోని సంసిధ్ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరచి విజేతలుగా నిలిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సాగర్‌బాబు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయి క్రీడల్లో 600మీటర్ల రన్నింగ్‌లో హంసవర్ధిని ప్రథమస్థానాన్ని, డివిజనల్‌స్థాయి పోటీల్లో నాసరయ్య అండర్-17 పురుషుల 800మీటర్ల రన్నింగ్‌లో ప్రథమస్థానాన్ని సాధించగా, హంసవర్ధిని అండర్-14 మహిళల 400మీటర్ల రన్నింగ్‌లో ప్రథమస్థానాన్ని, 600మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయస్థానాన్ని సాధించిందన్నారు. సాత్విక 200మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానాన్ని, వరుణ్‌కార్తీక్ 400మీటర్ల రన్నింగ్‌లో తృతీయస్థానాన్ని, 600మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయస్థానాన్ని సాధించినట్లు తెలిపారు. అండర్-14 షార్ట్‌పుట్‌లో అవినాష్, షణ్ముఖిలు ఇద్దరూ తృతీయస్థానాలు సాధించినట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సాగర్‌బాబు, పీడీ నాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.



పుల్లయ్య కుటుంబ సభ్యులకు బీమా నగదును అందజేస్తున్న సంగం డెయిరీ ప్రతినిధులు

పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే లక్ష్యం

● సంగం డెయిరీ జోనల్ మేనేజరు నరేష్‌బాబు

నరసరావుపేట రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే సంగం డెయిరీ ధ్యేయం అని డెయిరీ జోనల్ మేనేజరు కె.నరేష్‌బాబు తెలిపారు. నరసరావుపేట చిల్లింగ్ సెంటర్ పరిధిలోని కేతముక్కల అగ్రహారంలో పత్తిపాటి లింగారావు పాల సెంటర్లో సంగం డెయిరీకి పాలుపోసే యాసరపు పెద్ద పుల్లయ్య ఇటీవల మరణించాడు. ఈ నేపథ్యంలో పుల్లయ్య నామిని యాసరపు సుబ్బులుకు 50వేల రూపాయల చెక్కును, మట్టి ఖర్చులు నిమిత్తం 10వేల రూపాయలను గురువారం అందజేశారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ కే నరేష్‌బాబు మాట్లాడుతూ, సంగం డెయిరీ నుంచి పాల ఉత్పత్తిదారులకు, పశువులకు (40శాతం రాయితీపై) బీమా చేయడం జరుగుతుందన్నారు. పాల ఉత్పత్తిదారులకు రాయితీపై ప్రోత్సాహక బహుమతులు, కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు, మందులు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ పాలుత్పత్తిదారులు, పాలకేంద్రం అధ్యక్షుడు, సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

నరసరావుపేట లీగల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల నిర్మూలనపై పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా వివిధ పాఠశాలలు, కళాశాలలో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించి జీవితంలో వారు ఉన్నత శిఖరాలు అధిరోహించేలా తీర్చిదిద్దేందుకు తోడ్పాటునందిచేలా కృషి చేయాలని సూచించారు.

మరమ్మతులను త్వరితగతిన పూర్తిచేయాలి

● ఎంపీడీవో ఉమాదేవి

నూజెండ్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో పీ ఉమాదేవి అన్నారు. గురువారం మండలంలోని వీ అప్పాపురం ఎస్టీ కాలనీ, మారెళ్ళవారిపాలెం గ్రామాల్లో ఎంపీడీవో పీ ఉమాదేవి పర్యటించి తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుఫాన్ ప్రభావానికి మండలంలోని రహదారులు కోతకు గురై ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు త్వరితగతిన మరమ్మతులు చేస్తామన్నారు. అదే విధంగా పేదలకు శాశ్వత గృహాలను నిర్మించేందుకు ప్రభుత్వం ఇస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో హౌసింగ్ ఏఈ యలమంద, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



మారెళ్ళవారిపాలెంలో కోతకు గురైన కల్వర్టును పరిశీలిస్తున్న ఎంపీడీవో పీ ఉమాదేవి

డ్రెయిన్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయండి

● డ్వామా పీడీ సిద్దలింగమూర్తి

ఈపూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండేపల్లిలో మ్యాజిక్ డ్రెయిన్స్ నిర్మాణాన్ని డ్వామా పీడీ సిద్దలింగమూర్తి గురువారం పరిశీలించారు. పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. నిర్మాణ నాణ్యతలో ఎక్కడా రాజీపడకుండా చేయాలన్నారు. ప్రస్తుతం సుమారు 12 వందల మీటర్ల కాలువ నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఉపాధి శ్రామికుడు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో పుష్పరాజ్, టీఏలు నారాయణ, బేబీ రోజా,ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీను పాల్గొన్నారు.



గుండేపల్లిలో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పీడీ

10 నుంచి యోగ శిక్షణ శిబిరం ప్రారంభం

నరసరావుపేట టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం 190వ ఉచిత యోగ శిక్షణ శిబిరం ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభం అవతుందని నరసరావుపేట శాఖ నిర్వాహకులు కూనిశెట్టి వెంకట జనార్ధనరావు గురువారం తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని పట్టాభిరామస్వామి ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి 7గంటల వరకు 28 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. 42 యోగ భంగిమలు నేర్పిస్తామన్నారు. అదనపు సమాచారం కోసం కన్వీనర్ కూనిశెట్టి అనూరాధ, 9490846333, 9491665733ను సంప్రదించాలన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ఆర్‌పీలకు అవగాహన



మొక్కలు నాటుతున్న కౌన్సిలర్ షకీలా బేగం తదితరులు

వినుకొండ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వ్యర్థాలను వేరు చేయడం, తడి చెత్తను కంపోస్ట్‌గా మార్చడం ఆ కంపోస్ట్‌ను తిరిగి టెర్రస్ గార్డెన్‌కు వినియోగించే అంశాలు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గురువారం శిక్షణ ఇచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్, ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ గవర్నెన్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో వినుకొండ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలోని మెప్మా రిసోర్స్ పర్సన్‌కు ఈ శిక్షణ జరిగింది. వినుకొండ మున్సిపల్ పాలక సంస్థ కార్యాలయ కౌన్సిల్ హాల్‌లో ఘన వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిర్మూలన, స్వచ్ఛ సర్వేక్షన్ వంటి అంశాలపై ఒక్కరోజు పూర్తిస్థాయి శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా కౌన్సిలర్ షేక్ షకీలాబేగం, కమిషనర్ ఎం.సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో ఒక మామిడి మొక్కను నాటారు.

జిల్లా స్థాయి కబడ్డీ జట్ల ఎంపిక

రొంపిచర్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రొంపిచర్లలో జిల్లాస్థాయి అండర్-17 బాలుర, బాలికల జట్ల ఎంపిక కార్యక్రమం గురువారం జరిగింది. మొత్తం నరసరావుపేట డివిజన్ పరిధిలోని 183 మంది క్రీడాకారులు ఎంపిక కార్యక్రమంలో పాల్గొన్నారు. బాలుర, బాలికల జట్లు త్వరలో బాపట్ల జిల్లాలో జరిగే జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం సుభానీ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

ఘనంగా కార్తీకమాస గురుపౌర్ణమి వేడుకలు



కార్తిక పౌర్ణమి సందర్భంగా మార్కాపురం రోడ్డులో అయ్యప్పస్వామిని ఊరేగిస్తున్న జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు

వినుకొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కాపురం రోడ్డులోని అయ్యప్పస్వామి దేవస్థానంలో కార్తిక పౌర్ణమి సందర్భంగా అయ్యప్పస్వామి వారికి పంచ హారతులు, శివలింగ దీపార్చన, అయ్యప్ప స్వామి పల్లకి సేవ, జ్వాలాతోరణం వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, అయ్యప్పస్వామి దేవస్థానం ధర్మకర్త గుడివాడ చిన గురునాథరావు, అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

● పట్టణంలోని కొత్తపేట సురేష్ మహల్ రోడ్‌లోని కాశీవిశ్వేశ్వర ఆలయంలో కార్తికమాస గురుపౌర్ణమి సందర్భంగా కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ క్షేత్రంలో కార్తీక పౌర్ణమి శాస్త్రోక్తకంగా నిర్వహించారు. బుధవారం రాత్రి 7గంటలకు నూలు ఒత్తులను నెయ్యితో జ్వాలాతోరణం కనుల పండగగా, ఆలయ ఆవరణలో నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని వేడుకలను తిలకించారు.

● పట్టణంలోని శ్రీనివాస్‌నగర్‌లోని అలివేలుమంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి సేవా సమితి ట్రస్ట్‌లో కార్తిక పౌర్ణమి పుష్కరించుకొని దేవస్థాన అర్చకులు శ్రీ శ్రీనివాసుల శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆకాశదీపం సహస్ర దీపోత్సవం కార్యక్రమం సహస్రనామార్చన అనంతరం కోలాటం జరిగింది.



వినుకొండ శ్రీనివాసనగర్‌లోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో దీపాలంకరణలో స్వామివారు

శివయ్య స్తూపం సమీపంలో ప్రమాదకరంగా గుంత



ప్రభుత్వ వైద్యశాల వద్ద ఏర్పడిన పెద్ద గుంత

వినుకొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివయ్య స్తూపం సెంటర్ సమీపంలోని ప్రభుత్వ వైద్యశాల వద్ద ప్రధాన రహదారిపై భారీ గుంత ఏర్పడటంతో వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. గడిచిన నెల రోజుల వ్యవధిలో రాత్రి వేళల్లో ప్రమాదాలకు గురై గాయపడిన ఘటనలు ఉన్నాయి. వర్షం పడితే గుంత ఆనవాలు కనిపించకపోవడంతో ద్విచక్రవాహనదారులతో పాటు రోడ్డుపై ప్రయాణించే స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చి రాకపోకలకు ఆటంకం లేకుండా చూడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు చీఫ్ విప్ జీవీ ప్రజాదర్బార్

వినుకొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వినుకొండ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు కార్యాలయ వర్గాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపాయి. ప్రజా దర్బార్‌లో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పాల్గొంటారన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని వెల్లడించారు. వినుకొండ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి ప్రజలు ప్రజాదర్బార్‌కు తరలివచ్చి విజ్ఞాపన పత్రాలు అందించవచ్చన్నారు.

త్రీ వీలర్ కోసం దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలి: జీవీ

అర్హులైన దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం ఉచితంగా త్రీ వీలర్ మోటారు సైకిళ్లను అందజేస్తుందని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కోరారు. ఈ నెల 25లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దివ్యాంగులు ఇబ్బంది పడకుండా వినుకొండ నియోజకవర్గంలోని అర్హులైన దివ్యాంగులకు ఉచితంగా చీఫ్ విప్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడం జరుగుతుందని, అందుకు ప్రత్యేకంగా కార్యాలయంలో సిబ్బందిని కేటాయించడం జరిగిందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి, రెగ్యులర్ డిగ్రీ, ఆపై ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులు, పదో తరగతి ఉత్తీర్ణులై స్వయం ఉపాధితో జీవించే దివ్యాంగులు 18 నుంచి 45 ఏళ్ల లోపు 70 శాతం అంగవైకల్యం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్హత సర్టిఫికెట్‌తో పాటు, సదరం సర్టిఫికెట్, రేషన్, ఆధార్ కార్డులతో దివ్యాంగులు చీఫ్‌విప్ కార్యాలయంలో సిబ్బందిని సంప్రదించి ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.



టాలెంట్, వక్తృత్వ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులతో హెచ్‌ఎం విజయభారతి, ఉపాధ్యాయులు

వక్తృత్వ పోటీల్లో యడ్లపాడు విద్యార్థుల ప్రతిభ

యడ్లపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీలలో యడ్లపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. చిలకలూరిపేటలోని ఆర్‌వీఎస్ సీవీఎస్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ పోటీలలో నియోజకవర్గంలోని అన్ని ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. పోటీలలో పాల్గొన్న యడ్లపాడు జడ్పీ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని కె శాంతి ప్రథమస్థానం సాధించింది. అలాగే క్విజ్ పోటీలలో పాఠశాలకు చెందిన వి.నవీన, కె.హాసన, వి.లాస్యల టీం తృతీయ బహుమతిని సాధించింది. అంతేగాకుండా మండలస్థాయిలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్టులో పాఠశాలకు చెందిన విద్యార్థుల టీం తృతీయబహుమతిని కైవసం చేసుకున్నారు. మండల, నియోజకవర్గ స్థాయి పోటీలలో సత్తా చాటిన విద్యార్థులను హెచ్‌ఎం విజయభారతి, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, ఎస్‌ఎంసీ సభ్యులు అభినందించారు.

ఇనిమెళ్ల రహదారికి మరమ్మతులు

రొంపిచర్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరేపల్లి నుంచి ఇనిమెళ్ళ వెళ్ళే రహదారి అధ్వానంగా తయారైంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు దృష్టికి స్థానిక టీడీపీ నాయకులు తీసుకువెళ్ళారు. ఎమ్మెల్యే ఆదేశాలతో గురువారం రహదారి నిర్మాణ పనులను చేపట్టారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు కనిగిరి బాల మురళీ కృష్ణ తదితరులు పర్యవేక్షించారు.